జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## అంబేద్కర్‌కి పూజలు చేసిన మోదీ


ముంబై, మహానాడు:

ప్రధాని మోదీ అంబేద్కర్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ముంబైలోని చైతన్య భూమికి వెళ్లి పుష్పాలు సమర్పించి నమస్కరించారు. తాను ఆ ప్రదేశానికి రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలు ఎప్పటికీ అలాగే ఉంటాయని పేర్కొన్నారు.









# ఎన్ని 'కళంక' సంఘం!

- సీఎస్‌పై వేటు వేయలేదేం?
- ఆయనను రక్షిస్తున్నదెవరు?
- పథకాలకు నిధుల బదిలీలో సీఎస్ అత్యుత్సాహం కనిపించలేదా?
- కూటమి ఫిర్యాదులు అరణ్యరోదనే
- పోలింగ్ ముందు డీజీపీ బదిలీ వల్ల ఏం ప్రయోజనం?
- తెలుగు డీజీపీ ఈసీకి పనికిరారా?
- మరి బెంగాల్‌లో స్థానికుడికే ఎలా ఇచ్చారు?
- డీఎస్పీ,సీఐలపై ఎన్డీఏ కూటమి ఫిర్యాదులు నిష్ఫలం
- మాచర్లలో ఇద్దరు ఐజీలున్నా ఎస్పీపైనే వేటా?
- ఎస్పీ నివేదిక ఇచ్చినా ఎస్పీపై చర్యలా?
- పోలీసు పరిశీలకుడి నివేదిక అడగరా?
- మాచర్ల ఘటనలో ఈసీదే వైఫల్యం
- రాష్ట్ర ఎన్నికల సంఘంలో వేగమేదీ?
- ఢిల్లీ నుంచి వస్తేనే చర్యలా?

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఎన్నికల సమయంలో ఎంత పెద్ద ప్రధాని అయినా.. ఎంత లావు ముఖ్యమంత్రులయినా ఎన్నికల సంఘం ముందు బలాదూరే. ఆ సమయంలో వారే అసలైన పాలకులు. అంటే సర్వాధికారులన్నమాట. చివరాఖరకు కోర్టులు కూడా ఈసీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని చెప్పేశాయి.

మరి అంత పవర్‌ఫుల్ ఈసీ ఏపీలో ఎందుకు చేష్టలుడిగిపోయింది? సొంత నిర్ణయాలు తీసుకోకుండా, ఢిల్లీవైపు ఎందుకు చూసింది? మూడు ప్రధాన పార్టీలు కట్టకట్టుకుని.. కట్టలు కట్టలుగా చేసిన ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోలేదు? అందరి వేళ్లూ అనుమానంగా చూపిన సీఎస్‌ను, ఇప్పటిదాకా ఎందుకు బదిలీ చేయలేదు? ఆయనకున్న ప్రత్యేకత ఏమిటి? ఆయనను ఏ టీటీడీ రెడ్డిగారు రక్షిస్తున్నారు? అసలు పోలింగ్ అనంతర హింసకు, ఈసీ వైఫల్యమే కారణం కాదా? ఇద్దరు ఐజీలు పర్యవేక్షించిన మాచర్ల అల్లర్లకు, ఎస్పీని బలి చేయడం ఏకపక్షం కాదా? అసలు అది ఎన్నికల సంఘమా? లేక ఎన్ని'కళంక' సంఘమా?.. ఇదీ సగటు ఆంధ్రుడు సంధిస్తున్న ప్రశ్నాస్త్రాలు.

ఏపీలో ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం లేదన్న సీఎం జగన్ సందేహమే చివరకు నిజమయింది.




అధికారులను మార్చిన చోటనే అల్లర్లు జరిగాయన్న.. సలహాదారు సజ్జల కవి హృదయాన్ని ఈసీ అర్థం చేసుకుంటే, ఈ మొత్తం వ్యవస్థలో ఎవరు విఫలమయ్యారో స్పష్టమవుతుంది. పోలింగ్ అనంతరం పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన పైశాచికదాడులు, చివరాఖరకు ఎస్పీ కారుపై ముష్కరమూకలు దాడి చేస్తే.. ప్రాణభయంతో పోలీసులు ఇళ్లలో దాక్కున్న సిగ్గుమాలిన పనికి, ఎవరు నవరంధ్రాలూ మూసుకోవాలి? అసలు ఈ వైఫల్యంలో ఈసీ పరిశుద్ధురాలా? కాదా? అన్నది చూద్దాం.

ఏపీలో పాలకులకు పక్కభజనలు చేసే కొందరు పోలీసు అధికారులు.. ఎన్నికల సమయంలో వికృతరూపం చూపిస్తారని, ఎన్డీయే కూటమి మిగతా.. 2లో

## ఎన్నికల కమిషన్ అనుమతి లేక
## కేబినేట్ భేటీ వాయిదా

- అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ
- అవసరమైతే ఢిల్లీకి వెళ్లి ఈసీ అనుమతి కోరతాం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



3లో



6లో

## కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై
## రేవంత్‌రెడ్డి ఆరా

- ఎన్‌డీఎస్ఏ సిఫారసులను వివరించిన ఉత్తమ్
- రిపేర్లు, పునరుద్ధరణతో ముప్పు తోసిపుచ్చలేమని స్పష్టం
- కేబినెట్ భేటీలో చర్చించాలని సీఎం నిర్ణయం




## తెలంగాణ ఈఏపీ సెట్
# ఫలితాల విడుదల

- మొత్తం 2,62,587 మంది అర్హత
- ఏపీ విద్యార్థులకు తొలి రెండు ర్యాంకులు

హైదరాబాద్, మహానాడు:

తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సులలో ప్రవేశానికి నిర్వహించి న ఈఏపీ సెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొత్తం 2,62,587 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో 74.98 శాతం, అగ్రికల్చ ర్, ఫార్మా కోర్సుల ఎంట్రన్స్‌లో 89.66 శాతం అర్హత సాధించారు. మొదటి 10 ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన విద్యార్థులు సమానంగా ఉన్నారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంకు చెందిన జ్యోతిరాదిత్య మొదటి ర్యాంక్ సాధించాడు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 1,00,432 మంది దరఖాస్తు చేసుకుంటే 91,633 మంది హాజరు(91.24 శాతం) మంది హాజరయ్యారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 2,54,750 మంది దరఖాస్తు చేసుకోగా 2,40,618 మంది(94.45 శాతం) హాజరయ్యారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ఎంట్రన్స్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు మొదటి రెండు ర్యాంకులు సాధించడం విశేషం. అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ఎంట్రన్స్‌లో ఆలూరి ప్రణీత మొదటి ర్యాంక్, విజయనగరానికి చెందిన రాధాకృష్ణ రెండో ర్యాంక్ సాధించాడు.



ప్రవాసాంధ్రుడు డాక్టర్ ఉయ్యూరు లోకేష్‌ను జగన్ రెడ్డి ప్రభుత్వ అక్రమంగా అరెస్ట్ చేసి, విడుదల అనంతరం పరామర్శిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ నాయకులు మన్నవ సుబ్బారావు, దారపనేని నరేంద్రబాబు, చిలక బసవయ్య, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ తదితరులు

## అమెరికా డాక్టర్‌పై
## ఆంధ్రా పోలీసుల అరాచకం

- గన్నవరం ఎయిర్‌పోర్టులో అరెస్టు
- చాతీనొప్పితో ఆసుపత్రిలో చేరిన డాక్టర్ లోకేష్
- పోలీసుల చర్యపై ఆగ్రహం
- అమెరికన్ ఎంబసీకి ఫిర్యాదు

(అన్వేష్)

గన్నవరం: ఈయన పేరు డాక్టర్ లోకేష్. ఇంతకూ ఆయన చేసిన నేరం సీఎం జగన్ లండన్‌కు వెళుతున్న సమయంలో, ఈ డాక్టర్ కూడా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఉండటమేనట. పైగా అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు కనిపించారట. సెల్‌ఫోన్‌లో సీఎం టూర్‌కు సంబంధించి చాటింగ్ కూడా కూడా ఉందట. అందువల్ల ఈ డాక్టర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారట. విమానం ఎక్కేందుకు తాను కొన్న టికెట్‌ను కూడా పోలీసులకు చూపించినా నమ్మకుండా, తమదైన శైలిలో 'విచారించారట'. దానితో పోలీసుల ఒత్తిళ్లకు తాళలేక సదరు డాక్టర్, ఛాతీ నొప్పికి గురైతే ఆయనను ఆసుపత్రికి తరలించారు. "కడపలో మాజీ ఎంపి మిగతా.. 2లో

## ఎన్నికల హింసపై
## ఈసీకి ప్రాథమిక నివేదిక

- కీలక నేతలను అరెస్టు చేసే అవకాశం
- స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్‌కు మూడంచెల భద్రత
- క్షేత్రస్థాయి పర్యటనలకు సీఈవో మీనా




అమరావతి, మహానాడు:

రాష్ట్రంలో పోలింగ్ తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రాథమిక విచారణ పూర్తిచేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను సీఈవో కార్యాలయం కేంద్ర ఎన్నికల సంఘానికి పంపింది. ఆ నివేదిక ఆధారంగా ఈసీ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించనుంది. కాసేపట్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఏడీజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు కానుంది. కాగా హింసాత్మక ఘటనలపై ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో విచారణ మొదలుపెట్టినట్లు సమాచారం. రేపటిలోగా పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలో చోటుచేసుకున్న ప్రతి ఘటనపైనా సిట్ ఈసీకి నివేదిక ఇవ్వనుంది. సిట్ నివేదిక ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి చర్యలు తీసుకోనుంది.

### కీలక నేతల అరెస్టులకు అవకాశం

హింసాత్మక ఘటనలకు కారణమైన కొందరు కీలక నేతల అరెస్టులు జరిగే అవకాశం ఉంది. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అలాగే కొందరు అభ్యర్థులతో అంట కాగిన పోలీసు అధికారులపైనా తీవ్ర చర్యలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఘటనలు చోటుచేసుకున్న నియోజకవర్గాల్లో మిగతా.. 2లో







## మూడు జిల్లాలకు
## కొత్త ఎస్పీలు వీరే

అమరావతి:

పల్నాడు జిల్లాకు మల్లికా గర్గ్, తిరుపతి జిల్లాకు హర్షవర్ధన్, అనంతపురం జిల్లాకు గౌతమి శాలిని నియమిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఏపీ సీఎస్ జవహర్ రెడ్డికి సీఈసీ ఆదేశాలు జారీ చేసింది.

## పల్నాడు కలెక్టరుగా లాట్కర్



- నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు
- ప్రశాంత వాతావరణానికి చర్యలు

నరసరావుపేట, మహానాడు:

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేష్ లాట్కర్, ఎస్పీగా మల్లికా గార్గ్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ లాట్కర్ 2011 బ్యాచ్‌కు చెందిన వారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పనిచేస్తున్న ఆయనను బదిలీపై కలెక్టర్‌గా నియమించారు. మిగతా.. 2లో



## ధాన్యం కొనుగోలును
## వేగవంతం చేయాలి

- రైతుబంధు నిధులు విడుదల చేయాలి
- అన్ని రకాల వడ్లకు బోనస్ అమలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

4లో..

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024

## పల్నాడు కలెక్టరుగా లాట్కర్

(మొదటిపేజీ తరువాయి..)

అలాగే ఎస్పీగా నియమితుల్కెన మల్లికాగార్డ్ గతంలో కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. తర్వాత ప్రకాశం జిల్లా ఎస్పీ, తిరుపతి ఎస్పీగా కూడా పని చేశారు. ఆమె పశ్చిమబెంగాల్‌కు చెందిన పోలీస్ అధికారి. పల్నాడు జిల్లాకు వచ్చిన తొలి మహిళా ఎస్పీ. కాగా ఎన్నికల ముందు, తర్వాత జరిగిన ఘటన లపై జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయగా, ఎస్పీ బిందుమాధవ్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది.

### ఐదో దశ పోలింగ్ రేపే

## బరిలో రాహుల్, రాజ్‌నాథ్

న్యూ ఢిల్లీ, మహానాడు



లోక్‌సభ ఎన్నికల ఐదో విడత పోలింగ్ సోమవారం జరుగుతుంది. దీనికి సంబంధించిన ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. అమేథీ, రాయ్‌బరేలీ సహా 49 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 82 మంది మహిళలు. అమేథీ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ, రాయ్‌బరేలీ నుంచి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, లక్నో నుంచి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ లీకేజీ

◆ చేపల గుడిసె దగ్ధం

గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు స్టేజి దగ్గర ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై ఓ పూరి గుడిసె దగ్ధమైంది. గట్టు మండలం ఆరగిద్ద గ్రామానికి చెందిన మారెప్ప పెంచికలపాడు గ్రామా స్టేజ్ వద్ద పూరి గుడిసె నిర్మించుకొని చేపల ఫ్రై చేసి వినియోగదారులకు విక్రయించేవాడు. శనివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించి పూరి గుడిసె అగ్నికి అహుతైంది. ఈ ఘటనలో వంటసామాగ్రి, ఫ్రిజ్, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.1.లక్షల 50000 వెయ్యిలు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## వాట్సాప్ స్టేటస్‌లో 1 మినిట్ వీడియో




ఐఓఎస్ యూజర్ల కోసం వాట్సాప్ 'స్టేటస్ అప్‌డేట్స్-1 మినిట్' ఫీచర్ తీసుకొచ్చింది. ఇప్పటివరకు 1-30 సెకన్ల వీడియోలు మాత్రమే స్టేటస్ పెట్టుకునేందుకు వీలుండగా, ఇక నుంచి ఒక నిమిషం వరకు నిడివి గల వీడియోలను స్టేటస్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ కొంతమంది బీటా టెస్టర్లకు అందుబాటులో ఉందని, త్వరలోనే మిగతా వారికి అందుబాటులోకి వస్తుందని వాబీటా ఇన్ఫో వెల్లడించింది.

## ఇస్రోతో తమిళనాడు ప్రభుత్వ ఒప్పందం

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖర పట్టణంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటుకానున్న చోట 1,500 ఎకరాల్లో 'స్పేస్ పార్క్' నిర్మాణం కానుంది. ఇందుకోసం ఇస్రోతో తమిళనాడు ప్రభుత్వ



నిర్వహణలోని 'టిడ్కో' ఒప్పందం కుదుర్చుకుంది. కాగా ప్రస్తుతం భారత్‌లో నెల్లూరు జిల్లా శ్రీహరికోట వద్ద బంగాళాఖాతం తీరంలో మాత్రమే రాకెట్ ప్రయోగ కేంద్రం అందుబాటులో ఉంది.

## అప్పన్న సన్నిధిలో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు ప్రారంభం

సింహాచలం అప్పన్న దేవాలయంలో రెండు ఎలక్ట్రిక్ బస్సులను ఆలయ



చైర్మన్ అశోక్ గజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తితో కలిసి ప్రారంభించారు. ఒక్కో బస్సు ఖరీదు రూ.కోటి 65 లక్షలని, రెండున్నర గంటల పాటు ఛార్జింగ్ చేస్తే 225 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుందన్నారు. భక్తుల సౌకర్యార్థం కాలుష్యాన్ని తగ్గించేందుకు రెండు బస్సులను కొనుగోలు చేసి భక్తులకు అందుబాటులో ఉంచామని అశోక్ గజపతిరాజు తెలిపారు.

## ఎవరెస్ట్‌పై ఎగిరింది పసుపు జెండా

◆ 81 ఏళ్ల వయసులో వృద్ధుడి రికార్డ్

ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను 81 ఏళ్ల వయసులో అధిరోహించి తెలుగుదేశం జెండా ను ఎగురవేసి అభిమానాన్ని చాటుకున్నాడు ప్రత్తిపాడు గ్రామానికి చెందిన




గింజుపల్లి శివప్రసాద్. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహించిన అత్యంత పెద్ద వయస్కుడిగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఆయనను తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అభినందించారు.

# ఎన్ని'కళంక' సంఘం!

(మొదటిపేజీ తరువాయి..)

ఈసీకి ఫిర్యాదు చేసింది. ఆ సర్కారుకు భజంత్రీలుగా మారిన ఆ అధికారుల పేర్లు కూడా నివేదించింది. వారితోపాటు కిందిస్థాయిలో 'ఫ్యాను'కు 'ఫ్యాన్సు'గా మారిన డీఎస్పీ-సీఐల పేర్ల జాబితా కూడా ఇచ్చింది. అయినా ఈసీ పట్టించుకోలేదు. అప్పుడే ఈసీ కళ్లు తెరచిఉంటే, ఇప్పుడు ఆంధ్రా జాతీయ స్థాయిలో అప్రతిష్ఠ మూటకట్టుకునేది కాదన్నది మేధావుల మాట.

అన్నింటికీ మించి.. జగన్ సర్కారు మళ్లీ రావాలని కోరుకునే సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని తొలగించాలని కాళ్లకుబలపాలు కుట్టకుని తిరిగింది. ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేసింది. స్వయంగా ఎన్డీయే నేతలే వెళ్లి ఈసీకి ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపి, ప్రముఖ న్యాయవాదని కనకమేడల రవీంద్ర అయితే ఢిల్లీలోనే తిష్ఠవేసి, ఆంధ్రాలో రోజువారీ జరిగే అరాచకాలపై పుంఖాను పుంఖాల ఫిర్యాదులిచ్చారు. అయినా పాపం ఆయనకు మిగిలింది కంఠశోషనే.

సీఎస్ జవహర్‌రెడ్డిని తొలగించాలని చివరకు.. ప్రధాన ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేనాధిపతి పవన్ కల్యాణ్ చేసిన ఫిర్యాదులను ఈసీ బుట్టదాఖలు చేసింది. ఎన్నికలపై ప్రభావం చూపిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని బదిలీ చేయాలని కోరితే, ఆయన సర్వీసు పొడిగించిన ఘనత మన కేంద్రానిది. బదిలీల సందర్భంలో చేసే సిఫార్సులో సీఎస్ చాలా తెలివిగా వ్యవహరించి, తమకు అనుకూలంగా ఉండే అధికారులను ఈసీ జాబితాలో చొప్పించారన్నది ప్రధాన ఆరోపణ.

పోలింగ్ ముందురోజు లబ్ధిదారులకు లాభం చేకూర్చడం ద్వారా, తన కడప జిల్లా వాసిని మళ్లీ సీఎం చేయాలన్న ఆయన తపన ఫలించలేదు. దానికి ఈసీ అంగీకరించలేదు. పేదలకు మంచిచేద్దామంటే, ఈసీతో కలసి కూటమి కుట్ర చేస్తోందని జగన్ సహా వైకాపేయులంతా ఇల్లుపీకి పందిరేశారు. మరి పోలింగ్ అయిన తర్వాత ఈసీ కూడా.. "పథకాల డబ్బు ఆపినందుకు మీరు మమ్మల్ని బద్నాం చేశారు. ఇప్పుడు పోలింగ్ ముగిసింది కాబట్టి, మీరు చెప్పిన డబ్బులు లబ్ధిదారులందరికీ ఒకేసారి వేయండి " అని ఈసీ ఆదేశిస్తే, నిజంగా అది ఎన్నికళంక' సంఘం కాకుండా.. ఎన్నికల సంఘమే అయ్యేదని బుద్ధిజీవుల ఉవాచ.

డీజీపీ స్థాయి అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సెస్పెన్షన్ చెల్లదని, క్యాట్ విస్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఆయనను తక్షణం విధుల్లోకి తీసుకోమని సీఎస్‌ను ఆదేశించింది. బుర్ర-బుద్ధి ఉన్న వారెవరయినా.. తక్షణం అంటే 'వెంటనే' అని అర్ధం చేసుకోవాల్సి ఉంటుంది. అయినా ఇప్పటిదాకా సీఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మామూలురోజుల్లో అయితే, సీఎం నిర్ణయం కోసం ఎదురుచూడాలి. కానీ ఇప్పుడు స్వయంగా సీఎస్ నిర్ణయాధికారి.

అయినా సరే ఆయన ఏబీకి పోస్టింగ్ ఇవ్వలేదు. పైగా హైకోర్టుకు అపీలుకు వెళితే కోర్టు తిరస్కరించింది. హైకోర్టు-సుప్రీంకోర్టు-చివరకు క్యాట్ కూడా.. ఏబీ సస్పెన్షన్ చెల్లని విస్పష్టమైన తీర్పు ఇచ్చి, ఆయనను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించాయి. కానీ సీఎస్ మాత్రం ఏబీకి పోస్టింగు ఇవ్వకుండానే, రిటైర్ చేయించాలన్న కృషి చేయడం ఎవరి కళ్లలో ఆనందం చూసేందుకన్నది సోషల్‌మీడియా సైనికులు సంధిస్తున్న ప్రశ్న. వెంకన్న తిరుమల సన్నిథిలో తిష్టవేసిన ఓ రెడ్డిగారే, ఈ మొత్తం యవ్వారంలో చక్రం తిప్పితే, అది తెలుసుకోలేని ఎన్డీయే కూటమి కళ్లు మూసుకుంది.

సీఎస్ ఉత్సాహానికి సంబంధించి కళ్లెదుట ఇన్ని ఉదంతాలు కనిపిస్తున్నా, చర్యలు తీసుకోకుండా ఈసీ ధృతరాష్ట్ర పాత్ర పోషిస్తే.. మరి అది ఎన్నికల సంఘం అవుతుందా? ఎన్ని'కళంక' సంఘం అవుతుందా? అన్నది బుద్ధిజీవుల ప్రశ్న. పోనీ డీజీపీనయినా.. ఫిర్యాదులొచ్చిన వెంటనే మార్చారా అంటే అదీలేదు. మీనలేషాలు లెక్కబెట్టి నిర్ణయం తీసుకునేలోగా, పోలింగ్ గడువు దగ్గరపడింది. ఇక ఆయనను బదిలీ చేసి ఏం ప్రయోజనం? పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు డీజీపీని మార్చిన ఈసీకి.. కొత్త డీజీపీ మాట, కిందస్థాయి అధికారులు వింటారా? ఆయన సంసారం చక్కబెట్టుకోవడానికి ఎంతకాలం పడుతుందన్న సందేహం ఈసీకి రాకపోవడమే విచిత్రం.

మరి డీజీపీ ఎంపికలో ఈసీ ఏమైనా, అందరూ మెచ్చే నిర్ణయం తీసుకుందా? అంటే అదీ లేదు. సీనియారిటీలో మొదటి పేరున్న ద్వారకాతిరుమలరావును పక్కనపెట్టి, హరీష్‌గుప్తాను పీఠమెక్కించింది. కారణం ద్వారకా తిరుమలరావు స్థానికుడు కావడమేనట. అంటే స్థానికుడైతే నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకోలేరన్నది ఈసీ కవిహృదయం కామోసు! డీజీపీ ఎంపికలో ఇంత జాగ్రత్తలు తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం, మరి కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే పశ్చిమబెంగాల్ డీజీపీఐ వేటేసింది. అదే పని ఏపీలో చేయలేకపోయింది. అది వేరే విషయం! మరి బెంగాల్‌లో కూడా స్థానికుడికి కాకుండా, ఉత్తరాది అధికారికి డీజీపీ ఇచ్చిందా అంటే అదీ లేదు. అక్కడ 1989 బ్యాచ్‌కు చెందిన సంజయ్ ముఖర్జీకి, డీజీపీ ఇవ్వాలని సిఫార్సు చేసింది. సదరు అధికారేమీ ఇక్కడ డీజీపీ మాదిరిగా ఉత్తరాది అధికారి కాదు. పదహారణాల బెంగాలీబాబే! గత ఎన్నికల్లో కూడా ఈసీ ఉత్తరాది అధికారులకే పట్టం కట్టడాన్ని విస్మరించలేం. మరి పశ్చిమబెంగాల్ న్యాయం.. ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు వర్తించదని ప్రశ్నించిన వారేలేరు. అంటే విధి నిర్వహణలో ఉత్తరాదివారు తప్ప, మిగిలినవారెవరూ మొనగాళ్లు కాదన్న ఈసీ సిద్ధాంతాన్ని అంతా అంగీకరించాలి.. అంగీకరించారన్నమాట!

ఇక గుంటూరు-అనంతపురం ఎస్పీలపై ఈసీ వేసిన వేటు కూడా, నిస్సందేహంగా విమర్శలకు అర్హమైనవే. తనకు సరిపడా సిబ్బంది ఇవ్వమని వేడుకున్న, గుంటూరు ఎస్పీ బిందుమాధవ్‌ను సస్పెండ్ చేసిన ఈసీ.. హింస జరిగిన అదే మాచర్లలో పర్యవేక్షకులుగా ఉన్న ఇద్దరు ఐజీలను మాత్రం ఉపేక్షించడం క్షంతవ్యం కాదు. ఒకేచోట ఇద్దరు ఐజీలను పెట్టి, వారి కింద ఒక ఎస్పీని పనిచేయమంటే.. కింది స్థాయి పోలీసులు ఎవరి మాట వింటారన్న తెలివి, మెడపై తల ఎవరికైనా ఉంటుంది. కానీ ఆ తెలివి ఈసీకి లేదని, అది తీసుకున్న నిర్ణయంతో తేలిపోయింది. అనంతపురం-తిరుపతిలో కూడా అదే పరిస్థితి.


కింద స్థాయిలో పనిచేసే వీరభక్త వైసీపీ అభిమాన అధికారులను తొలగించకుండా, ఎస్పీలు ఎలా స్వేచ్ఛగా పనిచేస్తారన్న స్పృహ కూడా ఈసీకి లేకపోవడం మన దౌర్భాగ్యం. ఇద్దరు ఐజీల పర్యవేక్షణలో ఉన్న మాచర్లలో, వారి క ళ్లు కప్పి అక్కడి ఎమ్మెల్యే-ఆయన సోదరుడు పరారయిపోవడం ఎవరి నిర్లక్ష్యం? దానికి శిక్ష వేయాల్సింది ఎవరికి? అక్కడి జిల్లా ఎస్పీకా? అక్కడే ఉండి శాంతిభద్రతలు పర్యవేక్షించిన ఇద్దరు ఐజీలకా? ఈ ప్రశ్నకు జవాబిచ్చే ధైర్యం ఈసీకి ఉందా?

పోలింగ్ అనంతర హింసకు కారణమయిన ఐఏఎస్-ఐపిఎస్, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలపై వరసగా వేటు వేసి చేతులుదులిపేసుకున్న ఈసీ.. అసలు వారి బాసులయిన డీజీపీ-సీఎస్‌లపై, ఎందుకు వేటు వేయలేదు?వారేమైనా బదిలీలకు అతుతులా? అన్నది పౌరసమాజం సంధిస్తున్న ప్రశ్న. ఎన్నికలకు ముందే పాలకపార్టీ అడుగులకు మడుగులొత్తే వారి జాబితాను, ఎన్డీయే కూటమి జిల్లాల వారీగా ఇచ్చింది. వారిపై చర్యల కొరడా ఝుళిపించకుండా.. గుప్పెడునిద్రమాత్రలు మింగిన వారిలా మత్తుగా జోగిన వైనాన్ని, ఎన్ని'కళంక' సంఘమంటే తప్పేమిటన్నది పౌరసమాజం ప్రశ్న. ఎందుకంటే.. ఈసీ వైఫల్యం కళ్లెదుటే కనిపిస్తోంది కాబట్టి!

## 1986లో ఎక్కడున్నావు మోదీ?

◆ కాంగ్రెస్ హయాంలోనే రామమందిరం తెరిచింది
◆ రామరాజ్యం స్ఫూర్తిగా రాజీవ్‌గాంధీ పాలన
◆ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మహానాడు: గాంధీభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను గౌరవించాల్సిన ప్రధాని మోడీ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం దురదృష్టకరం. దేశంలో ప్రార్థన మందిరాలను కాపాడుకునే ఏకైక రాజకీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాం గ్రెస్ అధికారంలోకి వస్తే రామ్ లల్లా మీద బుల్డోజర్ తీసుకువస్తారని ప్రచారం చేస్తున్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలోనే రామ్ లల్లా దర్శనం కోసం గేట్లు తెరిచారని గుర్తుపెట్టుకోవాలి. 1986లో రామ్ లల్లా దర్శనం కోసం గేట్లు తీశారు. రామ మందిరం నిర్మాణం శంకుస్థాపనకు తోడ్పడ్డారు. అప్పుడు నరేంద్ర మోదీ ఎక్కడ ఉన్నాడో తెలియదు. మత సామరస్యాన్ని గౌరవిస్తున్న సెక్యులర్ పార్టీ కాంగ్రెస్. 1989లో రాజీవ్ గాంధీ ఎన్నికల ప్రచారం అయోధ్య నుంచే ప్రారంభించారు. 1986లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామ మందిర నిర్మాణం రెండు దశాబ్దాల ముందే జరిగేది. ఇంత పెద్ద వివాదం జరిగేది కాదు. రామాయణ, మహాభారతాలను దూరదర్శన్‌లో టెలికాస్ట్ చేసింది రాజీవ్ ప్రధాని గా ఉన్నప్పుడే అన్న విషయం తెలుసుకోవాలని హితవుపలికారు. రామ మందిర




శంకు స్థాపనలో బీర్ బహదూర్ సింగ్ కేంద్ర హెూంమంత్రిగా పాల్గొ న్నారు. శ్రీరా ముడిని పూజించడం హైందవ సంప్రదాయం. రామరాజ్యం స్ఫూర్తిగా రాజీవ్ గాంధీ పరిపాలన చేశారు. హిందూ సంప్రదాయాన్ని గౌరవించే పార్టీ కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు.

## 1.07 కోట్ల ఓట్లు పెరిగాయి

### నాలుగు దశల తుది పోలింగ్ శాతాలు వెల్లడి



**న్యూఢిల్లీ, మే 18,మహానాడు:** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల్లో నాలుగు విడతల్లో పోలైన తుది ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. ఈసీ చెప్పిన వివరాల ప్రకారం అన్ని నియోజక వర్గాల్లో కలిసి పోలింగ్ రోజున ప్రకటించిన ఓట్ల సంఖ్యకు, తాజాగా వెల్లడించిన తుది ఓట్ల మధ్య 1.07 కోట్ల తేడా ఉంది. మొదటి విడతలో ఈ తేడా 18.6 లక్షలు, రెండో విడతలో 32.2 లక్షలు, మూడో విడతలో 21.1 లక్షలు, నాలుగో విడతలో 33.9 లక్షలతో మొత్తం 1.07 కోట్ల ఓట్లు పెరిగాయి. సగటున ఒక్కో నియోజకవర్గంలో పెరిగిన ఓట్లు 28 వేలుగా తేలాయి. దీనిపై ఈసీ వివరణ ఇస్తూ ఎన్నికలైన తర్వాత ప్రకటించిన ఓట్లలో పోస్టల్ ఓట్లను చేర్చలేదని తెలిపింది.

## అమెరికా డాక్టర్‌పై ఆంధ్రా పోలీసుల అరాచకం

(మొదటిపేజీ తరువాయి..)

వివేకానందరెడ్డిని ఆయన ఇంట్లోనే గొడ్డలితో నరికితే, చంపిందెవరో ఐదేళ్లయినా కనిపెట్టలేని పోలీసులు.. అమె రికాలో ప్రఖ్యాత డాక్టర్‌ను మాత్రం అనుమానితుడిగా కనిపెట్టడమే వింత" అని, సోషల్‌మీడియాలో నెటిజన్లు పోలీసులపై ఫైరవుతున్నారు.

ఈయన పేరు డాక్టర్ తుళ్లూరు లోకేష్. ఆయన అమె రికాలోని వాషింగ్టన్‌లో వైద్యుడు. ఆయనకు అమెరికా సిటిజన్ షిప్ కూడా ఉంది. అమెరికాలో పేరు పొందిన ప్రఖ్యాత వైద్యుడిని మన పోలీసులు అన్యాయం గా అరెస్ట్ చేసి, ఒక అమెరికన్ సిటిజన్‌షిప్ ఉన్న డాక్టర్‌ని అతి హీనాతిహీనంగా కొట్టారు అని ఆయనే వెల్లడించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన సేవాకార్యక్రమాలు ఎన్నో ఎన్నో. అమరావతి రైతులు కోసం కూడా బాగా నిలబడ్డారు. న్యాయ సహాయం చేశారు. అలాంటి ఉన్నత వ్యక్తి పోలీసులు కొట్టారు. అమెరికన్ ఎంబసీకి ఈ దారుణాన్ని తెలిపారు.

## ఎన్నికల హింసపై -ఈసీకి ప్రాథమిక నివేదిక

(మొదటిపేజీ తరువాయి..)

ఎమ్మెల్యే అభ్యర్థులను గృహ నిర్బంధం చేశారు. ఆయా అభ్యర్థుల ఇళ్ల దగ్గర సాయుధ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతమున్న బలగాలకు అదనంగా 25 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు మోహరించనున్నారు. ఇప్పటికే 20 కంపె నీల పారా మిలటరీ బలగాలు ఏపీకి చేరుకున్నాయి. హింసాత్మక ఘటనల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర ఉన్న భద్రతను రెండంచెల నుంచి మూడంచెలకు పెంచారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం సీఈవో క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లనున్నారు.

### సిట్ పరిధిలోకి విశాఖ ఘటన

తాజాగా విశాఖలో జరిగిన ఘటననూ సిట్ పరిధిలోకి తెచ్చే అంశంపైనా అధికా రులు ఆలోచన చేస్తున్నారు. తాడిపత్రి ఘటనలో డీఎస్పీ చైతన్య తన హద్దులు దాటి వ్యవహరించారని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భం గా సిట్ దర్యాప్తు చేయాలని ఆదేశించే అవకాశం ఉంది. ప్రతి ఘటనపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. రెండురోజుల్లో నివేదిక సమర్పించాలని ఈసీ ఆదేశించింది. వివిధ ఘటనల్లో పోలీసు అధికారుల వైఫల్యం కనిపించడంతో ఇప్పటికే ఈసీ పలువురు అధికారులపై వేటు వేసింది.



# మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఇంటిలిజెన్స్ సీతారామాంజనేయులు, ఐజి కొల్లి రఘురామరెడ్డి ఫోన్ కాల్ డేటా పరిశీలించాలి

- టీడీపీ పార్టీ అధికారంలోకి రాకుండా పోలీసు అధికారులు రాజేంద్రనాథ్ రెడ్డి, సీతారామాంజనేయులు, కొల్లి రఘురామిరెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, ముఖ్యమంత్రి జగన్ పన్నిన కుట్రను కూడా సిట్ వెలికి తీయాలి
- మాచర్లలో పోలింగ్ సందర్భంలో అరాచకం సృష్టించి రక్తపాతానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పిన్నెళ్లి అతని తమ్ముడు వెంకట రామిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి
- టీడీపీ నేత నానిపై హత్యాయత్నానికి కారకుడైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అతని కుమారుడు మోహిత్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి
- పోలింగ్ రోజున అరాచం సృష్టించి అయినా జగన్ గెలవాలి, టీడీపీ ఓడిపోవాలని కుట్రపన్ని రాష్ట్రం అంతటా పోలీసు అధికారులకు ఫోన్లుచేసి బెదిరించిన
- టీడీపీ హయంలో ఎన్నికల కమిషన్ డీజీపీని, చీఫ్ సెక్రటరీని, ఇంటిలిజెన్స్ డీజీని, ఎందరో ఎస్పీలను బదిలీ చేస్తే జై కొట్టిన జగన్ ఈ రోజు అధికారును బదిలీ చేస్తే ఎన్నికల కమిషన్ తప్పుడు పట్టడం అన్యాయం
- గతంలో ముగ్గురు ఒకే కులానికి చెందిన డీఎస్పీలకు పోస్టింగ్ లు ఇస్తే 33 మందికి ఇచ్చారని గగ్గోలు పెట్టిన జగన్ ఈరోజు ఆయన కులస్తులకు ఎంతమందికి పోస్టింగ్ ఇచ్చారో చెప్పాలి
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

మంగళగిరి,మహానాడు:

ఓటమి భయంతో రాష్ట్రంలో రక్తపాతం సృష్టించి గెలవాలని వైసీపీ నేతలు యత్నించారు. విధ్వంసం సృష్టించారు. టీడీపీ నేతలు, టీడీపీ సానుకూల ఓటర్లపై హత్యలకు పూనుకున్నారు. ఈ విధ్వంసానికి పాల్పడిన వైసీపీ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ..

జగన్ రెడ్డి తీరు దొంగే దొంగా దొంగా అనట్లు గా వ్యవహరిస్తున్నాడు. ఓటమిని జీర్ణించుకోలేక రాష్ట్రంలో రక్త చరిత్రను సృష్టించి ఎలక్షన్ కమిషన్ పై మళ్లీ బురద చల్లేందుకు యత్నిస్తున్నాడు. ఓడిపోతున్నామన్న ఫ్రస్టేషన్ లో జగన్ రెడ్డి ప్లాన్ Bతో అరాచకం సృష్టించాడు. రాష్ట్రం పంపిన ప్రతిపాదనల నుండే అధికారులను ఎలక్షన్ కమిషన్ నియమించింది. ఆ అధికారులు సరిగ్గా పనిచేయడంలేదని వారిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరింది డీజీపీనే.

గతంలో 2019న ఒకే రోజు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, ఇంటెలిజెన్స్ డీజీతో పాటు పలువురు ఎస్పీలను తొలగిస్తే ఎలక్షన్ కమిషన్ చర్యలు భేష్ అని జగన్ రెడ్డి మెచ్చుకున్నది నిజం కాదా? నాడు ముగ్గురు కమ్మ కులం అధికారులు ఉంటే 33 మంది డీఎస్పీలు నియమించుకున్నారని జగన్ రెడ్డి గగ్గోలు పెట్టాడు. మళ్లీ జగన్ రెడ్డే ముగ్గురు కమ్మకులం అధికారులు మాత్రమే ఉన్నారని శాసన సభలో చెప్పింది నిజమే కదా. నేడు అసమర్థ ఆఫీసర్లను తొలగిస్తే ఎన్నికల కమిషనపై జగన్ రెడ్డి దాడి చేస్తున్నాడు. ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేసిన 12 మందిలో ఆరుగురు జగన్ రెడ్డి కులస్తులే ఉన్నారు.

రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీ ఆంజనేయులు, కొల్లి రఘురామరెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి లు పోలింగ్ రోజున ఎక్కడ ఉన్నారు? అందరూ కలిసి జగన్ గెలుపుకు కుట్ర పన్నింది నిజం కాదా? రాష్ట్రంలో రక్తపాతానికి కుట్రలు చేసింది వీరే.. వీరి కాల్ డేటా బయటకు తీస్తే అంతా తెలుస్తుంది.

మాచర్లలో నరమేధానికి కారకులైన ఎమ్మెల్యే రామకృష్ణ ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలను వెంటనే అరెస్ట్ చేయాలి. అరాచకం సృష్టించి హౌస్ అరెస్ట్ అయిన మాచర్ల ఎమ్మెల్యే అతని సోదరుడు తాడేపల్లి ప్యాలెస్ కు వచ్చి జగన్ రెడ్డి సూచనలతో రాష్ట్రం విడిచి పారిపోయారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులవర్తి నానిపై చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లు హత్యాయత్నం చేశారు. వీరిని వెంటనే అరెస్ట్ చేయాలి.

తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డి సృష్టించిన అరాచకం, విధ్వంసానికి అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలి. రాజంపేట డీఎస్పీ చైతన్య కు తాడిపత్రిలో పని ఏంటి... జేసీ ప్రభాకర్ రెడ్డి ఇళ్లు ధ్వంసం చేసి దివ్యాంగిపై దాడి చేయడం చాలా బాధాకరం... అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలి.

అధికారాన్ని వదులుకోవడం ఇష్టం లేక జగన్ రెడ్డి రక్త చరిత్రకు తెరలేపాడు.

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, అడిషనల్ డీజీపీ సీతారామాంజనేయులు, ఐజీ కొల్లి రఘురామిరెడ్డి పన్నిన కుట్రను సిట్ దర్యాప్తులో వెలికితీసీ హింసకు కారకులైన వైసీపీనేతలను జైలుకు పంపాలి. జగన్ రెడ్డి నేర చరిత్రపై బ్రిటన్ లోని ఓ యూనివర్సిటీలో చర్చకు వచ్చిందంటే జగన్ రెడ్డి ఎంత అవినీతి పరుడో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారు. గెలపు కూటమిదే. ప్రజలు అరాచక పాలనను తరమి కొట్టేందుకే పోటెత్తి వచ్చి ఓట్లు వేశారు.

## ఎన్నికల కమిషన్ అనుమతి లేక

# కేబినేట్ భేటీ వాయిదా

- అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ
- అవసరమైతే ఢిల్లీకి వెళ్లి ఈసీ అనుమతి కోరతాం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మహానాడు:

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం కేబినేట్ సమావేశం నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేబినేట్ సమావేశానికి ప్రభుత్వం ఈసీ అనుమతి కోరింది. కానీ శనివారం రాత్రి వరకు ఈసీ నుంచి అనుమతి రాలేదు.

ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో ఈరోజు జరగాల్సిన కేబినేట్ భేటీ నిలిచిపోయింది. ఈసీ నుంచి ఏ క్షణమైన అనుమతి వస్తుందని మంత్రులు అందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలో వేచి ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని విభాగాల అధికారులు కేబినేట్ భేటీకి హాజరయ్యేందుకు ఆఫీసులకు చేరుకున్నారు. కానీ రాత్రి 7 గంటల వరకు ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో కేబినేట్ భేటీ జరగలేదు. సీఎంతో పాటు మంత్రులు వెనుదిరిగి వెళ్లారు.

రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ భేటీలో చర్చించాలని ఎజెండా సిద్ధం చేసుకున్నారు. కానీ ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై చర్చించలేకపోయామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.





జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. అందుకు సంబంధించిన వేడుకల నిర్వహణతో పాటు పునర్విభజనకు పదేండ్లు పూర్తి కావటంతో ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్లో ఉన్న అంశాలు, పునర్విభజన చట్టంలో పెండింగ్లో ఉన్న కీలకమైన అంశాలను కేబినేట్ భేటీలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కేబినేట్ భేటీ వాయిదా పడటంతో ఇవేవీ చర్చ జరగలేదు.

ఈసీ నుంచి అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. సోమవారం లోపు ఈసీ నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి అనుమతి కోరుతామని చెప్పారు.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఎలాంటి చర్యలు ఉండవా?

డిజిపి స్థాయి పోలీసు ఉన్నతాధికారిపై కాట్ తీర్పు తర్వాత కూడా ఏ.బి.వెంకటేశ్వరరావుపై కక్షసాధింపు చర్యలు కొనసాగిం చడం అత్యంత గర్హనీయం. న్యాయ వ్యవస్థ పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైఖరి ఏంటో ఈ ఉదంతం ద్వారా బహిర్గత మౌతున్నది. అధికారంలో ఉన్న రాజకీయ నాయకత్వం, ఉన్నతాధికారుల మధ్య ఉన్న అపవిత్ర బంధానికి ఇది ప్రబల నిదర్శనం. ఈ అంశంపై ఈ రోజు ఉదయం టీవీ5 డిబేట్ లో నేను, డా. యన్.తులసిరెడ్డి, రఫీ, ముగ్గరం ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాం.





రెండవసారి సస్పెండ్ చేయడం సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘించడమేనని క్యాట్ తీర్పులో పేర్కొంది కదా? మరి, ఆ తప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఎలాంటి చర్యలు ఉండవా? పైపెచ్చు, ఆయనే క్యాట్ తీర్పును అమలు చేయకుండా ఆపి, కక్షసాధింపు లో భాగస్వామి అవుతారా? ప్రజాస్వామ్య వ్యవస్థలో, ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో, పోలింగ్ కూడా ముగిసిన తరువాత ఇంత దుర్మార్గమైన పాలన కొనసాగడం, సరిదిద్దే వ్యవస్థ లేకపోవడం సమాజానికి మేలు చేకూర్చదు.

**- టి.లక్ష్మీనారాయణ**

**సామాజిక ఉద్యమకారుడు**



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 19, మే 2024

# స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ఠ భద్రత ఉండాలి

- సమీపంలోకి అనధికార వ్యక్తులను రానివ్వొద్దు
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా
- శ్రీకాకుళంలో మూడంచెల భద్రత పరిశీలన

శ్రీకాకుళం:

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు దగ్గర పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు. శ్రీకాకుళం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధికలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనధికార వ్యక్తులను ఈ ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం శ్రీకాకుళం పార్లమెంటుతో పాటు, ఎనిమిది శాసన నియోజకవర్గాల కు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఉన్న భద్రతా పరిస్థితులను గమనించారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు న్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. మూడం చెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పరిశీలించారు. ఈవీఎం కంట్రోల్ రూమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమా అన్సారియా, టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా పరిషత్ సీఈవో వెంకటేశ్వరరావు, డీపీవో వెంకటేశ్వరరావు, ఆయా నియోజకవర్గాలకు సంబం ధించి రిటర్నింగ్ అధికారులు భరత్ నాయక్, సి.హెచ్.రంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శన్ దొర, రామ్మోహనరావు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# పాపం.. ఈ బుట్టమ్మల సంపాదన అంతంత మాత్రమే!

- విశాఖలో పారిశ్రామికవేత్తల బుట్టమ్మలు ఐప్యాక్ ఆఫీసులో..

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఈ ఫొటోలో కనిపిస్తున్న ముగ్గురు మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తుపట్టారా? లేదా? పోనీ అప్పుడెప్పుడో ఓసారి జగనన్న సర్కారు, విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ గుర్తుందా?.. ఆ.. యస్. ఆ చిత్రమే ఈ వి'చిత్రం'! ఆ సమ్మిట్‌లో పాల్గొని ఏపీలో వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు, ఈ ముగ్గురు మహిళా పారిశ్రామికవేత్తలు విశాఖ వెళ్లారు.

వారితోపాటు, వారి కంపెనీల సీఈఓలు కూడా వచ్చే ఉంటారు. మరి వేల కోట్ల యాపారం-యవ్వారం కదా? అంతలావు పెట్టుబడిపెట్టే మోతబరులు ప్రభుత్వాలతో ఒప్పందాలకు వెళ్లినప్పుడు, వారి వెంట సీఈఓలు కూడా రావాలి కదా? వస్తారు! అలా ఆ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ఈ ముగ్గురు మహిళా పారిశ్రా మిక వేత్తలు, ఒక్కోరు తలా వెయ్యి కోట్ల రూపాయలు ఉదారంగా పెట్టుబడులు పెట్టారట.

ఏపీలో జగనన్న ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం.. నిరుద్యోగులకు ఉపాధి కోసం పడుతున్న కష్టాన్ని ఇంగ్లీషు పేపర్లలో చదివి.. బొత్స సత్తిబాబు ఇంగ్లీషులో మాట్లాడిన తీరుకు ఫిదా అయి.. ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టామని సెలవిచ్చారట. తమ దేశంలో కూడా ఇంగ్లీషు అంత చక్కగా ఎవరూ మాట్లాడరని కితాబిచ్చారట.

అంతేనా? దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీలో శాంతి భద్రతలు దివ్యంగా ఉన్నాయని.. రోడ్లు వంగి ముద్దుపెట్టు కోవాలనే బాపూ బొమ్మంత సుందరంగా ఉన్నాయని.. ఉచితంగా ఇసుక దొరుకుతున్న రాష్ట్రం ఇదొక్కటేనని.. కాంట్రాక్టర్లకు పని చేసిన వెంటనే బిల్లులిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని తెలుసుకుని.. విమానాలు అందుబాటులో లేకపోతే, పంచకల్యాణి గుర్రాలను కిరాయికి తెచ్చుకుని మరీ విశాఖ వచ్చామని ఇంగిలిపీసులో, తెలుగుపేపరోళ్లకు చెప్పారు. మళ్లీ పెట్టుబడులు పెట్టిన ఈ మహిళా పారిశ్రామికవేత్తలు కనిపించలేదు. వేలకోట్ల అధిపతులు కదా? బిజీగా ఉంటారు మరి!

సీన్ కట్ చేస్తే.. పోలింగ్ ముగిసిన తర్వాత జగనన్న, తన పార్టీని జాకీలతో పైకి లేపిన ఐప్యాక్ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ వారినుద్దేశించి ట్కచె తన్యవంతమైన ప్రసంగం చేశారు. దానితో అక్కడున్న అక్కాషెల్లెమ్మలు, 'షిక్కటి షిరునవ్వు'లు చిందిస్తూ అన్నతో సెల్ఫీ దిగారు. అన్న సెల్ఫీల ముచ్చట తెలిసిందే కాబట్టి, దాన్ని పట్టించుకోవలసిన పనిలేదనుకోండి. జగనన్నకు తన దగ్గరకు ఎవరైనా సెల్‌ఫోన్‌తో వస్తే, వారి ఫోను తీసుకుని మరీ సెల్ఫీ తీసుకోవడం మహా సరదా.

మళ్లీ సీన్ కట్ చేస్తే.. జగనన్నతో కలసి 'షిక్కటి షిరునవ్వు'తో సెల్ఫీ దిగిన 'అక్కషెల్లమ్మల'మధ్య, మన విశాఖ మహిళా పెట్టుబడిదారులు కూడా కనిపించడమే ఆశ్చర్యం. రాష్ట్రాన్ని ఉద్ధరించేందుకు వేలకోట్ల రూపాయల పెట్టుబడి పెట్టిన ఈ మహిళా పారిశ్రామికవేత్తలకు, ఐప్యాక్ ఆఫీసులో ఏం పని? అని భృకుటి ముడివేసిన వారూ లేకపోలేదు. తర్వాత తీరిగ్గా విచారిస్తే.. పాపం ఆ మహిళా పారిశ్రామిక వేత్తల అక్కషెల్లెమ్మలకు 'యాపారంలో నష్టాలొచ్చా'యట.

దానితో దిక్కుతోచక.. రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమదానం చేస్తున్న, ఐప్యాక్ టీములో ఉద్యోగానికి చేరినట్లు తెలిసింది. ఎలాగూ తాము కూడా రాష్ట్రాభివృద్ధికే, వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలనుకున్నందున.. ఐప్యాక్ కూడా అదే పనిచేస్తున్నందున, రెండూ ఒకటేనని భావించి ఐప్యాక్ టీంలో చేరి, విశాఖలో అప్పట్లో అద్దెకు తెచ్చుకున్న సూట్లను తిరిగి డ్రామా కంపెనీకే ఇచ్చారట.

విశాఖ సమ్మిట్‌లో ఐప్యాక్ టీం సభ్యులకే సూటు-కోటు-బూటు వేసి పారిశ్రామికవేత్తల వేషం వేసిన ఐప్యాక్ పిచ్చగుంట తెలివి, ఆ తర్వాత తెల్లవారుఝామునే సోషల్‌మీడియాలో తెల్లారింది. ఇప్పుడు ఆ నటీమణులంతా జగనన్నతో సెల్ఫీతో




దిగడంతో.. జగనన్న తల'కట్టు' కథ మాదిరిగానే, ఈ కథ కూడా సోషల్‌మీడియా పుణ్యాన కంచికిచేరింది.

విశాఖ సమ్మిట్‌లో సూటు వేసుకుని, పారిశ్రామికవేత్తల బిల్డప్ ఇచ్చిన వారి పాత ఫొటోను.. లేటెస్టుగా ఐప్యాక్ టీముతో జగనన్న దిగిన సెల్ఫీని జోడించి, సోషల్‌మీడియా సైనికులు రప్పాడేస్తున్నారు. ఇదంతా ఐప్యాక్ మహిమ.. వాళ్లనలా వదిలేయకండి. ఎవరికైనా చూపించద్రా.. నందికి ఎక్కువ-ఆస్కారుకు తక్కువ అంటూ.. తెగ కామెంట్లు పెట్టేస్తున్నారు. అయినా జగనన్న చెప్పినట్లు.. పాపం మన బుట్టమ్మల సంపాదన అంతంతమాత్రమే!

అన్నట్లు.. ఐదేళ్లూ జగనన్నను చేయి పట్టి నడిపించిన ఐప్యాక్.. బెజవాడలో ఉంటున్న దుకాణాన్ని సర్దేసిందట. అంతేనా? తన సిబ్బంది కోసం కార్లు బుక్ చేసిన ట్రావెల్స్‌కు డబ్బులు ఇవ్వకుండా ఎగనామం పెట్టేసిందట. అందులో పనిచేసే సోషల్‌మీడియా సైనికుల వద్ద ఉన్న పెన్‌డ్రైవులు, ల్యాప్‌టాపులు అన్నీ స్వాధీనం చేయమని హుకుం జారీ చేసిందట. ఇప్పటికైతే దుకాణం సర్దేస్తున్నాం. అంటే మీకు సెలవు లిస్తున్నాం. మళ్లీ ఫోన్ చేసినప్పుడు రమ్మంటూ సందేశాలు పంపించిందని సోషల్‌మీడియా కోడై కూస్తోంది. నిజం 'జగన్నాథుడి'కెరుక..

4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024

# స్త్రీధనం.. భరణం.. ఒక్కటేనా?

- దానిపై భర్తకు, అత్తమామలకు హక్కు ఉంటుందా?
- సుప్రీంకోర్టు ఏం చెబుతోంది.!

'స్త్రీ ధనం' అంటే ఏమిటి? స్త్రీ ధనంపై భర్తకు హక్కు ఉంటుందా? భరణం, స్త్రీ ధనం ఒక్కటేనా? ఇవన్నీ సాధారణ ప్రజలకు ఉండే సందేహాలు. ఈ సందేహం నివృత్తి కావాలంటే ఈ వివరణ చదవండి. స్త్రీ ధనం ప్రాధాన్యత గురించి ప్రతి ఆడపిల్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

'స్త్రీ ధనం'పై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. స్త్రీ ధనం అనేది భార్యాభర్తల ఉమ్మడి ఆస్తిగా మారదని, దానిపై భర్తకు హక్కు ఉండదని స్పష్టంచేసింది. పెళ్లి తర్వాత స్త్రీధనాన్ని భర్త లేదా అత్తమామల అదుపులో ఉంచినప్పుడు, వారు కేవలం ధర్మకర్తలుగా వ్యవహరించాలే తప్ప, దాన్ని స్వప్రయోజనాల కోసం వాడుకోకూడదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. మహిళ అడిగిన వెంటనే ఆమెకు చెందిన స్త్రీధనాన్ని తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఒకవేళ తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తే, నేరపూరిత ఉల్లంఘన కిందికి వస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

భరణం వరకట్నం, స్త్రీ ధనం, భరణం మూడు ఒకటే అని చాలా మంది భావిస్తుంటారు. కానీ ఈ మూడు వేర్వేరు. వరుడు వరకట్నం తీసుకోవడం చట్టవిరుద్ధం. కానీ స్త్రీ ధనం అనేది చట్టబద్ధమైన అంశం. ఇక భరణం అంటే భర్త నుంచి విడాకులు తీసుకున్న తర్వాత, మహిళకు ప్రతినెలా అందే ఆర్థిక చేయూత. పెళ్లికి ముందు, పెళ్లి సమయంలో, మహిళకు ఆమె కుటుంబం, బంధువులు, స్నేహితులు అందించే వస్తువులను స్త్రీధనం అని పిలుస్తారు.

స్త్రీధనం పరిధిలో మహిళకు చెందిన చర, స్థిరాస్తులతో పాటు ఆభరణాలు, బంగారం, వెండి, విలువైన రాళ్లు ఉంటాయి. ఆమెకు పుట్టింటి నుంచి వచ్చిన కారు, పెయింటింగ్‌లు, కళాఖండాలు, గృహోపకరణాలు, ఫర్నీచర్ కూడా స్త్రీధనమే. మహిళ తను సంపాదించిన డబ్బుతో చేసిన ఏవైనా పొదుపులు, పెట్టుబడులు కూడా ఆమెకే దక్కుతాయి.

మహిళ తన భర్త నుంచి విడిపోయే క్రమంలో స్త్రీధనాన్ని క్లెయిం చేయొచ్చు. ఆమె క్లెయింను తిరస్కరించడం కూడా గృహ హింస కిందికి వస్తుంది. ఆమె భర్తతో పాటు అత్తమామలు కూడా క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మహిళకు స్త్రీధనంగా వచ్చిన ఆభరణాలు, విలువైన వస్తువులను అత్తమామలు దాచిన సందర్భాల్లో, సదరు మహిళ అడగగానే వాటిని తిరిగి ఇచ్చేయాలి.



లేదంటే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 406 ప్రకారం 'నేరపూరిత నమ్మక ఉల్లంఘన' కేసును పెట్టొచ్చు. దీని ప్రకారం కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తుంది. భర్త చేసిన అప్పులు తీర్చడానికి మహిళకు సంబంధించిన ఆస్తి ఉపయోగించకూడదు. స్త్రీధన్ అనేది మహిళకు సంబంధించిన సంపూర్ణ ఆస్తి.

ఇవి స్త్రీధనం కిందకు రావు..

పెళ్లి సమయంలో భార్య తల్లిదండ్రులు భర్తకు బహుమతిగా ఇచ్చిన ఉంగరం, బంగారు గొలుసు వంటివి స్త్రీధనం పరిధిలోకి రావు. భార్య పేరిట భర్త ఏదైనా చర, స్థిరాస్తిని కొని బహుమతిగా ఇవ్వకున్నా, ఆ ఆస్తి స్త్రీధనం పరిధిలోకి రాదు. ఎవరైనా వివాహిత తన నెలవారీ సంపాదనలో కొంత మొత్తాన్ని ఇంటి ఖర్చుల కోసం ఉపయోగిస్తే, దాన్ని తిరిగి క్లెయిమ్ చేయడానికి వీలుండదు.జాబితాలు రాసుకోవాలి వీడియోలు దాచుకోవాలి!

మహిళ తనకు స్త్రీ ధనంగా వచ్చిన విలువైన వస్తువులు, కానుకలు, ఆభరణాల జాబితాను రాసుకోవాలి. వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపర్చుకోవాలి.

నగదు ఉంటే దాన్ని తన పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలి. ఆభరణాలు, విలువైన వస్తు వులకు సాక్ష్యంగా పెళ్లి ఫోటోలు, వీడియోలను వాడుకోవచ్చు. విలువైన ప్రతి వస్తువుకు బిల్లులు ఆమె పేరు మీద ఉండేలా చూసుకోవాలి. మహిళ ఒకవేళ జాబ్ చేస్తుంటే, ఆమె పేరు మీద ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఉండాలి.

- టి.వాసు






టెన్నిస్ అండర్ - 14 సింగిల్స్, డబుల్స్ ఆసియన్ విజేతగా నిలిచిన

# వనపర్తి బాలిక సాన్వీ రెడ్డి

- భారత దేశం తరపున పాల్గొన్న సాన్వీ రెడ్డి
- సాన్వీ రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి

హైదరాబాద్, మహానాడు:

టెన్నిస్ అండర్ - 14 సింగిల్స్, డబుల్స్ లో ఆసియన్ విజేతగా భారత దేశం తరపున ఆడిన వనపర్తి మండలం చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన వీ. సాన్వీ రెడ్డి నిలిచారు.

టెన్నిస్ లో భారత దేశం గౌరవాన్ని ఆసియన్ స్థాయిలో సాన్వీ రెడ్డి నిలిపారు.

టెన్నిస్ ఆసియన్ స్థాయి పోటీలు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఈనెల 13 నుంచి 17 వ తేదీ వరకు జరిగాయి. 17 న జరిగిన టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్స్ సింగిల్స్ లో బంగ్లాదేశ్ దేశానికి చెందిన సుమేరా అఖ్తర్ పై 7-6, 6-2 తేడాతో భారత దేశ టెన్నిస్ క్రీడాకారిణి సాన్వీ రెడ్డి విజయం సాధించారు.

డబుల్స్ ఫైనల్స్ లో భారత దేశ జోడి సాన్వీ రెడ్డి, నయీమా హుస్సేన్ బంగ్లాదేశ్ దేశ జోడి హైదర్ హుమేర, సుమేర అఖ్తర్ పై 7-5, 6-2 స్కోర్ తో విజయం సాధించారు. సాన్వీ రెడ్డి సోదరుడు తనీష్ రెడ్డి టెన్నిస్ అండర్ -14 ఆసియన్ స్థాయి పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరారు.

బంగ్లాదేశ్ నుంచి శనివారం హైదరాబాద్ కు చేరుకున్న సాన్వీ రెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారత దేశం, తెలంగాణ రాష్ట్రం, పాలమూరు - వనపర్తి జిల్లా పేరు ప్రఖ్యాతులు ప్రపంచానికి చాటి చెప్పాలని చిన్నారెడ్డి ఆకాక్షించారు. సాన్వీ రెడ్డి , తనీష్ రెడ్డి తల్లిదండ్రులు వీ. చైతన్య రెడ్డి, సౌమ్యాలను చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# గొట్టిపాటి లక్ష్మికి చంద్రబాబు అభినందన

- దర్శిలో బాగా పనిచేశారని ప్రశంసలు
- కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచన



దర్శి, మహానాడు:

దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి శనివారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. ఆమెతో పాటు భర్త కడియాల లలిత్‌సాగర్, కడియాల రమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా దర్శిలో విజయం కోసం చేసిన కృషి, వైసీపీ దౌర్జన్యాలు, దాడులను ఎదుర్కొన్న తీరు అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో అత్యధికంగా పోలింగ్ నమోద్కెన దర్శి నియోజకవర్గంలో ఓటర్ల చ్కెతన్యం, యువత ఎక్కువగా పాల్గొనడం, మహిళలు తరలిరావడం లక్ష్మిని విజయం వైపు నడిపిస్తుందని ఆకాంక్షించారు.

సీటు ప్రకటించినప్పటి నుంచి ప్రజల్లోకి వెళ్లిన విధానం, కూటమి మేనిఫెస్టోపై వివరించడం, ప్రజలతో కలిసిపోవడం, సమస్యలు గుర్తించడం ఇలా ఎన్నికల క్యాంపెయిన్, పోల్ మేనేజ్‌మెంట్ కూడా బాగా చేశారని అభినందించారు. బొట్లపాలెం ఘటనపై పోరాడటం, పోలింగ్ ప్రారంభించేందుకు లక్ష్మి చేసిన కృషి ప్రశంసనీయని పేర్కొంటూ కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివ రించారు. డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కడియాల రమేష్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు.



ఇదిగో ఆధారాలు..

# చర్యలు తీసుకోండి

- రాష్ట్రంలో అల్లర్లపై సిట్ చీఫ్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు
- 30 ఘటనలపై సాక్ష్యాలతో సహా వీడియో క్లిప్పింగులు
- పిన్నెల్లి సోదరులు, చెవిరెడ్డి-కుమారుడు, పెద్దారెడ్డే కారకులు
- విచారించి తక్షణమే వారందరినీ అరెస్టు చేయాలని కోరిన వర్ల
- కారకుల్కెన వారిని శిక్షిస్తామని సిట్ చీఫ్ హామీ ఇచ్చారు
- ఆహ్వానించి మరీ ఫిర్యాదు తీసుకున్నారని వెల్లడి

మంగళగిరి, మహానాడు:

రాష్ట్రంలో జరిగిన అరాచక ఘటలపై శనివారం సిట్ చీఫ్ వినిత్ బ్రిజ్‌లాల్‌కు టీడీపీ నేతలు వర్ల రామయ్య, మన్నవ సుబ్బారావు, కోడూరి అఖిల ఫిర్యాదు చేశారు. అరాచకాలకు పాల్పడిన పిన్నెల్లి సోదరులు, చెవిరెడ్డి తండ్రీ కొడుకులు, కేతి రెడ్డి పెద్దారెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. మాచర్ల, తాడిపత్రి, తిరుపతి, నరసరావుపేట, అనంత పురంలో జరిగిన అరాచకాలపై సాక్ష్యాలతో సహా వీడియో క్లిప్లింగ్‌లను అందజేశారు. అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. 30 ముఖ్యమైన సంఘటనలను, అందుకు కారకుల్కెన వారి వివరాలను ఇచ్చారు.

అనంతరం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం లో మాట్లాడారు. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. హౌస్ అరెస్టులో ఉన్న పిన్నెల్లి ఎలా పారి పోయాడని అడిగితే సిట్ చీఫ్ చిరునవ్వు నవ్వాడని.. పిన్నెల్లితో పోలీసులు మిలాఖత్ అయ్యారా? కుమ్మక్కు అయ్యారా అనేది తప్పకుండా విచారణ చేయిస్తానని, అన్ని ప్రాంతాలకు సిట్ టీమ్‌లు వెళ్లాయని పిన్నెల్లి సోదరులను పట్టుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సిట్ చీఫ్ సానుకూలంగా స్పందించారు

రాజేంద్రనాథ్‌రెడ్డి, సవాంగ్ ఉన్నప్పుడు టీడీపీ నేతలకు డీజీపీ ఆఫీసులోకి ప్రవేశం లేదని, నేడు స్వేచ్ఛగా డీజీపీ ఆఫీసులోకి వెళ్లినట్లు చెప్పారు. సిట్ చీఫ్ గౌరవంగా ఆహ్వానించి ఫిర్యాదును స్వీకరించినట్లు వివరించారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బ్రదర్స్‌ను, తిరుపతిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని కొడు కు, తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని అరెస్టు చేయాలని కోరారు. నాటు బాంబు లు, పెట్రోల్ బాంబులు తయారు చేసిన వారిని అరెస్టు చేయాలని కోరామన్నా రు. దానికి సిట్ చీఫ్ సానుకూలంగా స్పందించారు. తప్పు చేసిన వాళ్లని శిక్షి స్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అరాచకానికి జగన్ శ్రీకారం చుడితే అరాచ కాన్ని ఎన్నికల కమిషన్ ఆపాలని ప్రయత్నించిందని వర్ల అన్నారు. 2019లో డీజీపీని, సీఎస్ ను, ఎస్పీలను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేస్తే భేష్ అని జగన్‌రెడ్డి మెచ్చుకున్నాడని, నేడు తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటే ఎలక్షన్ కమిషన్‌పై దాడి చేస్తున్నాడని మండిపడ్డారు. చర్యలు తీసుకున్న 12 మంది అధికారుల్లో ఆరుగురు జగన్ రెడ్డి సామాజికవర్గం వారేనని తెలిపారు.

## కుట్ర వెనుక ఆ నలుగురు అధికారులు

ఓడిపోతున్నామనే తెలిసే నిరాశ నిస్పృహతో వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు.. అరాచకానికి శ్రీకారం చుట్టింది వైసీపీ నేతలే. ఈ కుట్ర వెనుక మాజీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అడిషనల్ డీజీ సీతారామాంజనేయులు, కొల్లి రఘురామిరెడ్డి, ధనుంజయ్ రెడ్డిలు ఉన్నారు. ఎన్నికల రోజు వీరి ఫోన్‌కాల్ డేటా బయటకు తీస్తే వారి కుట్రలు బయటపడతాయి. దొంగే దొంగ దొంగా అని అరిచినట్లు ఉంది వైసీపీ నేతల తీరు. ఇది పేరుమోసిన దొంగల ముఠా, నేర ప్రవృత్తిలో ఆరితేరిన ముఠా అని ధ్వజమెత్తారు. అరాచకాలపై చర్యలకు సిట్ వేయడంతో వైసీపీ నేతలు వణికిపోతున్నారని వ్యాఖ్యానించారు.



# ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

- రైతుబంధు నిధులు విడుదల చేయాలి
- అన్ని రకాల వడ్లకు బోనస్ అమలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

హైదరాబాద్, మహానాడు:

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు శనివారం సచి వాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. తడిసిన ప్రతీ గింజ కొనాలని, రైతు బోనస్ అమలు చేయాలని కోరారు. రైతు రుణమాఫీ చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని విన్నవించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు రసీదులు ఇవ్వడం లేదని చెప్పగా అధికారులను పిలిచి ఆదేశాలు జారీ చేశారు.

## రైతు సమస్యలపై వివరించాం

సీఎంను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ మూడు నుంచి నాలుగు కిలోలు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. కొనుగోలు ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారు.


మిగిలిన రైతుబంధుతో పాటు, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. కేవలం రైతుల అంశాలను మాత్రమే కాకుండా ఇతర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. మా వినతులపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమ కార్యాచరణ తీసుకు ంటుందని వెల్లడిరచారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024



## చంద్రబాబును కలిసిన
# యరపతినేని

**గురజాల:** గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు శనివారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పోలింగ్ పరిస్థితులను వివరించారు.



# చంద్రబాబు.. ప్రజలకే అతను కావాలి!

**రాజమండ్రి వీటీ కాలేజి...!**

**గేటు బయట టీకొట్టు..!**

**"యన్టీఆర్ కూతురి పెళ్ళి..పెళ్ళికొడుకు ఏపీ మినిష్టర్.."! అన్నాడు ఒక మిత్రుడు...!**

**ఆసక్తి గా అతని వంక చూస్తే...గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పెదాల మధ్య ..పొగ దట్టంగా సుడులు తిరుగుతూ గాల్లో కలుస్తుంది.**

**అతనే మళ్ళీ ..!**

**చంద్రగిరి ఎమ్మెల్యే..మినిష్టర్ "చంద్రబాబునాయుడు"..అన్నాడు.**

యన్టీఆర్ కుమార్తె వివాహమంటే అందరికీ ఆసక్తే..!
అప్పటికే చంద్రబాబు గురించి సినిమాటోగ్రఫీ మంత్రి కాబట్టి ..సినిమా పత్రికల్లో చిత్రప్రారంభోత్సవాలు..ఇంకా సినిమాలకు సంబంధించిన వార్తల్లో చూస్తున్నాము.
కాంగ్రెస్ వ్యతిరేకులం కాబట్టి, సహజంగానే వారిమీద చిన్నచూపు..!
ఆయనొక మినిష్టరు..యన్టీఆర్ అల్లుడు..అదృష్టవంతుడనుకున్నాము.

తీక్షణ ధృక్కులు..!కోరమీసం ..ఆజానుబాహువు.. స్ఫురద్రూపి
అప్పటి నుండి ఆయన గురించిన వార్తలు ఆసక్తికలిగించేవి..!

తదనంతరం యన్టీఆర్ పార్టీ..టీడీపి ఆవిర్భావం.. చంద్రబాబు ఏం చేస్తాడన్న కుతూహలం!
యన్టీఆర్ పదవీచ్యుతుడవ్వటం..ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం..!
రాష్ట్రం అట్టుడుకిన సమయం...!
చంద్రబాబు..తెరమీద కు వచ్చారు.
ఒక పక్క అధికారపార్టీ...పైన ఇందిరాగాంధీ..!

రాష్ట్రంలో కాంగ్రెస్ ముదర డెక్కలు..!
యన్టీఆర్ ..టీడీపి ఎమ్మెల్యేలని ముప్పు తిప్పలు పెడుతున్నారు.
అప్పుడు ..పిల్లల్ని ఎత్తుకు పోయే గద్దల బారి నుండి రక్షించుకునే కోడిలాగ ..పొదువుకున్నారు.
యన్టీఆర్ కు అండగా..మొత్తం తానై ముందుకు నడిపించారు.

ఆయనకు తోడుగా..వెంకయ్య..వామపక్షాలు ఉన్నాయి.
తిరిగి యన్టీఆర్ ముఖ్యమంత్రి కావటానికి శ్రమించారు.
తర్వాత పార్టీలో ..పని చేస్తూ..పార్టీ నిర్మాణం ..గ్రామస్థాయి నుండి పటిష్టపరిచారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు.



అప్పటికి వారు సమర్ధుడైన యువనాయకుడు..!
మంత్రిగా పనిచేశారు..!
ప్రజల్లో కూడా గుర్తింపు వచ్చింది కొద్దిగా..!

అయితే ప్రజాకర్షణ ..అనర్ఘళ వాగ్ధాటి లేదు.
ఆయనకు అది స్పష్టమైన లోపం..!

రాజును చూసిన కళ్ళతో మొగుడ్ని చూసినట్టు..!
యన్టీఆర్ స్థానం లో ఈయన్ని ఊహించుకోలేకపోయారు..కొందరు పార్టీ సానుభూతి పరులు..యన్టీఆర్ వీరాభిమానులు...!
తర్వాత ఆయన్ని ఆయన తయారు చేసుకున్నాడు.

సెల్ఫ్ మేడ్ మేన్!
అతని లోని లోపాలు..క్రమశిక్షణ..పనితీరు తో అధికమించటానికి ప్రయత్నం చేశారు.

రాజకీయం కొత్తమలుపు తీసుకున్నది.
ఎన్నికలు..అధికారం లక్ష్యంగా ఉండే రాజకీయాలు అభివృద్ధి ..సంస్కరణలు..వైపు మారాయి.
అభివృద్ధి లో భాగంగా కొత్తమార్గాలు అన్వేషించారు.
సంస్కరణలకు..దార్శనికత తోడయింది.
పని చేసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు..అదే ఆయన్ని తిరిగి ముఖ్యమంత్రి ని చేసింది.

దేశవిదేశాల పెట్టుబడులు..పాలనాపరమైన విధానాలు కొత్తపుంతలు తొక్కాయి.
ఆయన చేసిన..అభివృద్ధి..సంస్కరణ ఫలాలు ప్రజలకు పంచే లోపల ..అధికారం కోల్పోయారు.
ఆయన మస్తిష్కం నుండి..వచ్చిన ఆలోచనలు..దేశం ఆచరించింది.
రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంది.

ఆనాటి నుండి..ఆయన ఎదుర్కున్న..అవమానాలు..విమర్శలు దేశంలో ఏ రాజకీయనాయకుడు ఎదుర్కొని ఉండరు.

సుదీర్ఘకాలం అధికారంలో లేకపోయినా..పార్టీని కాపాడుకున్నారు.
విభజిత ఆంధ్ర ను...అభివృద్ధి దిశగా ..పరుగులు తీయించారు.
విభజన గాయాన్ని..అతి స్వల్ప కాలంలో మరిపించారు..!

ఆయన యజ్ఞం చేసారు..యాగం నిర్వహించారు.
యాగఫలం ప్రజలకందించే లోపల...!
ప్రజలు ఒక్క ఛాన్సు కు ప్రలోభపడ్డారు.

పూలు చల్లిన చేతులు రాళ్ళు విసిరాయి.
పొగిడిన నోళ్ళు తెగిడాయి.
సహచరులు ..కులముద్ర వేశారు..అపవాదులు ఆపాదించారు...అపనిందలు వేశారు.

ఓటమిని హుందాగా స్వీకరించారు..!
దారుణపరాజయం పట్ల విస్మయానికి గురయ్యారు..!

ప్రత్యర్థుల మాటల దాడులు..కేదరు పై కుట్రలు..అక్రమ కేసులు..తిరిగి పోరాటానికి సిద్ధమయ్యారు.
సభలో ఒంటరిని చేసి...చేసిన వ్యాఖ్యలు..తన వద్ద పని చేసిన..తాను పెద్ద స్థాయిలో కూర్చోబెట్టిన..ప్రాముఖ్యత ఇచ్చిన అధికారులు వ్యవహరించే తీరు మనస్థాపానికి గురిచేసింది.

మధ్యయుగాల నాటి పరిస్థితులు.

తన కళ్ళముందు కలల సౌధం కూలిపోతుంటే..ఆవేదన చెందారు.
మధురస్వప్నాన్ని భగ్నం చేశారు..!

చంద్రబాబు ను హింసించాలనే..ప్రత్యర్థులు పనిగట్టుకుని..ఆయన మానసపుత్రిక అమరావతి ని అతలాకుతలం చేసారు.

ప్రతిచర్య..ప్రతినిర్ణయం..చంద్రబాబు లక్ష్యంగా చేస్తున్నారు.

కేంద్ర రాష్ట్ర పెద్దలు అందరిదీ ఒకే లక్ష్యం..!

అన్నీ భరిస్తున్నారు..!

స్వపక్షం..విపక్షం..ప్రత్యర్థులు..మానసిక యుద్ధం చేస్తున్నారు.

అతను రాజర్షి..!
అతను యోగి..!
అతను దూషణ భూషణ తిరస్కారాలకు అతీతుడు..!
అతను నిత్యకృషీవలుడు..!
నిరంతర శ్రామికుడు..!

అతనికి ఇప్పుడు అధికారం తృణప్రాయం..!
ఈ క్షణం..ఇవాళ ప్రజలకే అతను కావాలి..!

పద్నాలుగేళ్ళు ముఖ్యమంత్రి..!
పద్నాలుగేళ్ళు ప్రతిపక్ష నాయకుడు..!
జాతీయ స్థాయి ప్రముఖ నాయకుడు..!

జీవితసాఫల్యం సాధించారు..!

తెలుగు నాట ..చరిత్ర పుటల్లో సింహభాగం ఆయన సొంతం..!
చంద్రబాబు నాయుడు....దార్శనికుడు..!
మీకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు!

**- అడుసుమిల్లి శ్రీనివాసరావు**

# మనదేశంలో అయితే.. ఉచితాలకు చచ్చినోడు లేచొస్తాడు!

◆ **ఉచితాలు వద్దన్న స్విట్జర్లాండ్ ప్రజలు**

ప్రపంచంలో ఈ దేశం పేరు వినని వారు ఉండరు. కొత్తగా పెళ్ళైయిన యువ దంపతులు ఆ దేశానికి హనీమూన్‌కు వెళ్ళాలి అని కోరుకుంటారు. ఆ జ్ఞాపకాలను జీవితాంతం గుర్తుపెట్టుకోవచ్చని.

భూతల స్వర్గంగా పేరొందిన దేశం, శీతల దేశమైనా ఎక్కడ చూసినా పచ్చని చెట్లు, సెలయేర్లు, మంచుతో కప్పబడిన పర్వత శ్రేణులు, అతి తక్కువ జనాభా, చుట్టుపక్కల ఉన్న అన్నిదేశాలతో చక్కటి సంబంధాలు, సైన్యం లేని దేశం (పేరుకు సైన్యముంది కానీ యుద్ధం చెయ్యడానికి కాదు. రెడ్ క్రాస్ సహాయకులుగా, శాంతి బృందాలుగా పనిచేస్తారు), శత్రువులు లేని దేశం. 18 ఏళ్ళు దాటితే మొగపిల్లలకు నిర్బంధ సైనిక శిక్షణ ఉందా దేశంలో.

స్విట్జర్లాండ్ పేరు వింటే ఆ దేశపు బ్యాంకు వ్యవస్థ గుర్తుకు వస్తుంది. (చాకలెట్స్, చీజ్ కు కూడా ఆ దేశం ప్రసిద్ధి పొందింది)

ఈ దేశానికి ఇంకో ప్రత్యేకత ఉంది. పౌరులందరూ చదువుకున్న వారే. ప్రభుత్వం ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవాలంటే అది ప్రజాభిప్రాయ ప్రకారమే సాధ్యపడుతుంది. మన దేశంలో చట్టసభల్లో సభ్యుయుల నిర్ణయమే అంతిమమం. అక్కడ అలా కాకుండా దేశప్రజాలకు ఉపయోగపడే చట్టాలు "ప్రజాభిప్రాయ సేకరణతోనే సాధ్యం". ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే నిర్బంధ వోటింగ్ ప్రజాభిప్రాయ సేకరణలో. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ హక్కును వినియోగించుకోవాలిసిందే.

మిగతా దేశాల బ్యాంకులకు స్విట్జర్లాండ్ బ్యాంకులకు తేడా ఏమిటి? ఎందుకు అవి అంత ప్రాచుర్యం కలిగి ఉన్నాయి ఒకప్పుడు?

ఆ దేశంలో ఉన్న ఎన్నో బ్యాంకుల్లోకి ప్రసిద్ధి పొందింది "స్విస్ బ్యాంక్" (ఇప్పుడు పేరు మారి UBS గా అందరికి పరిచయం). రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఈ స్విస్ బాంక్ ఒక కొత్త విధానాన్ని ప్రారంభించి విపరీతమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. అత్యంత ధనిక దేశం. ఈ దేశం గురించిన ఒక ఆసక్తికరమైన విషయం తెలుసుకుందాం.

అక్కడి బ్యాంకుల విధానమేమిటంటే ప్రపంచంలో ఏ దేశ ధనిక పౌరుడైన స్విస్ బ్యాంకులో ఖాతా తెరవచ్చు. వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

ఇతర దేశాల "ధనిక" పౌరుడు ఎలా సంపాదించాడు అన్నది ఆ బ్యాంకు అడగదు. ఒక నియంత తన దేశాన్ని దోచుకుని స్విస్ బ్యాంకులో దాచుకోవచ్చు, స్మగ్లర్లు, మాఫియా డాన్లు, మాధకద్రవ్యాల వల్ల సంపాదించినవారు, లాంచగొండి రాజకీయ నాయకులు, పన్నులు ఎగ్గొట్టే వ్యాపారస్తులు, మోసపురితంగా సంపాదించిన సొమ్ము, ఇలా ఎవరైనా అక్కడి బ్యాంకులో డబ్బుని మదుపు చెయ్యవచ్చు. రెండే రెండు రూల్స్ మాత్రం వర్తిస్తాయి.

మాములుగా మనం బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటే బ్యాంక్ మనకు వడ్డీ చెల్లిస్తుంది. కానీ స్విస్ బ్యాంక్ మాత్రం తన ఖాతాదారుల నుంచి రుసుము వసూలుచేస్తుంది. ఖాతాదారులు




డబ్బే కాదు, ఖరీదైన వజ్రాలు, బంగారం, బంగారు నగలు, పెయింటింగ్స్, వెలకట్టలేని పురాతన వస్తువులు కూడా అక్కడి వాల్ట్స్ లో భద్రపరుచుకోవచ్చు.

స్విస్ బ్యాంకు ఖాతాదారులకు ఒకే ఒక షరతు విధిస్తుంది. ఇది మొదటి రూల్. ఖాతా తెరిచినప్పుడు ఫోటో, చిరునామా ఏది అడగదు . రీఛార్జి కార్డులా ఖాతాదారునికి అకౌంట్ నెంబర్, పాస్వర్డ్ మాత్రం ఇస్తుంది. లాకర్ తీసుకున్న వారికి తాళం చెవి ఇస్తుంది, ఇంకో తాళం తమ దగ్గర ఉంచుకుంటుంది. లాకర్ అంటే మనకు ఇచ్చే లాకర్ సైజ్ నుంచి, కావాలంటే ఒక పెద్ద గది అంత లాకర్ కూడా అద్దెకు ఇస్తారు. ఖాతాదారుల దాచుకునే వస్తువులను బట్టి లాకర్ పరిణామం. ఈ లాకర్స్ అవి కూడా భూమిలో నాలుగైదు అంతస్తుల కింద ఉంటాయి పటిష్టమైన భద్రతతో. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ఆ లాకర్స్ దొంగలు దోచుకోలేకపోయారు అంటే ఊహించుకోవచ్చు ఎన్ని రకాల భద్రతా వలయాలు ఉన్నాయో.

బ్యాంకు ఖాతాదారుని గుర్తుపెట్టుకోదు. అకౌంట్ నెంబర్, పాస్వర్డ్ చెప్పిన వ్యక్తికి ఖాతా నుంచి డబ్బులు తీసుకునే సౌకర్యం ఉంది. అలాగే ఆ రెండూ చెప్పి లాకర్ తాళం చెవి చూపిస్తే లాకర్ తెరిచే సౌలభ్యం ఏర్పరిచింది.

ఇంకొక రూలు ఏమిటంటే.. ఖాతాలో ఎంత మొత్తం అయినా ఉండనివ్వండి, లేదా లాకర్స్ లో ఎంత విలువైన సామాగ్రి అయినా ఉండనివ్వండి. బ్యాంకు నిర్ణయించిన కాల పరిమితి లోపు ఖాతాను వాడకపోతే, అంటే ఒక పదేళ్లు లేదా ఇరవై ఏళ్ళ కాలం కావచ్చు, అప్పుడు ఆ ఖాతాను జప్తు చేసి అందులో ఉన్న మొత్తాన్ని ప్రభుత్వానికి అందచేస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ప్రపంచంలో అత్యంత ధనవంతులు యూదులు. జర్మనీ, పోలాండ్, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, లక్సంబర్గ్, నెదర్లాండ్స్ తదితర దేశాల యూదులే కాకుండా అమెరికాలో ఉన్న యూదులు కూడా ఈ బ్యాంకులో లెక్కపెట్టలేనంత డబ్బులు, బంగారం, వజ్రాలు, పెయింటింగ్స్ , కళాఖండాలు దాచుకున్నారు. అదంతా వారి కష్టార్జితం.

వీరే కాకుండా జర్మనీకి చెందిన నాజీ ఉన్నతాధికారులు, సైన్యాధికారులు యూదుల నుంచి కొల్లకొట్టిన కళాఖండాలు, బంగారం, నగదు దాచుకున్నారు.

యుద్ధానంతరం యూదులు, అధికారులు, సైన్యాధికారులు చాలామంది తిరిగి రాలేదు తమ సొమ్ముని తీసుకోవడానికి.

ఆ తరువాతి సంవత్సరాల్లో వివిధ దేశాధినేతలు, నియంతలు, మాఫియా డాన్ లు, మాధకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, ఇతరులు తన అక్రమార్జనను ఈ బ్యాంకులో దాచుకొని తిరిగి రానివారున్నారు.

ఆ విధంగా విపరీతంగా ధన నిలువలు పేరుకుపోయాయి. లాకర్స్ ఎన్నో ఏళ్లుగా తెరవకుండా పడి ఉన్నాయి. కొత్త శతాబ్ది ప్రారంభంలో అంటే 2000 సంవత్సరంలో ఇది జరిగింది.

అటువంటి పరిస్థితుల్లో ఒక సుముహూర్తాన అటువంటి ఖాతాలు అన్నిటికీ నోటీసులు ఇచ్చి, నిర్ణీత సమయానికి ఎవరూ రాకపోతే ఆ ఖాతాలు జప్తు చేయబడ్డాయి. చేసిన ఖాతా లోంచి స్వాధీనం చేసుకున్న సొమ్ముని ప్రభుత్వ ఖజానాకు తరలించడం జరిగింది. అలా ప్రభుత్వ ఖజానాకు వచ్చిన మొత్తం ప్రపంచంలోని నల్లధనంలో నలభై శాతం.

ప్రభుత్వం ఆయాచితంగా వచ్చిన సొమ్ముని ఎలా ఉపయోగించుకోవాలో అర్థం కాక ప్రజాభిప్రాయం తెలుసుకుందాం అని తమ దగ్గర ఉన్న సొమ్ము ప్రతి పౌరునికి పంచితే, ఒక మిలియన్ యూరోలు పైనే ముట్టుతాయి, లేదా ఏ రకంగా దేశ అభివృద్ధికి ఖర్చుపెట్టవచ్చో చెప్పండి మీ అభిప్రాయాన్ని అని వోటింగ్ నిర్వర్తించింది.

పదిహేను రోజుల సర్వే తరువాత 99.2% శాతం ప్రజలు, దేశ సుందరీకరణకు, తమ దేశాన్ని చూడడానికి వచ్చే యాత్రికుల సౌకర్యాలకు, టూరిజం అభివృద్ధికి ఖర్చుపెట్టాలి అని అభిప్రాయపడ్డారు.

దేశాభిమానులైన స్విట్జర్లాండ్ ప్రజలకు ఇదో పెద్ద విషయంలా అనిపించలేదు. ప్రతి పౌరునికి మిలియన్ యురొలు ఉచితంగా ఇస్తామనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, దేశ సౌభాగ్యనికి ఆ దేశ ప్రజలు ఓటు వేశారంటే, మిగతా దేశ పౌరులకు ఆశ్చర్యం కలగవచ్చు.

ఆ దేశ పౌరుల నిశ్చిత అభిప్రాయం ఏమిటంటే ఎందరో ఎన్నో విధాలుగా అన్యాక్రాంతంగా సంపాదించింది, అమాయకుల నుంచి కొల్లగొట్టి దాచుకున్న సొమ్ము తమకు ఉచితంగా ఇచ్చినా వద్దు అనేది 99.2% ప్రజల స్థిర అభిప్రాయం.

ఇక్కడ ఇంకో తమాషా జరిగింది.

2000 జనవరి 25వ తారీఖు ప్రజలు ప్రభుత్వ సర్వే ఆఫీసు ముందర బారులు తీరారు చేతిలో బ్యానర్స్ పట్టుకొని.

ఆ గుమిగూడిన ప్రజల డిమాండ్ ఏమిటంటే, ప్రభుత్వం ఇవ్వదలుచుకున్న ఉచిత ఒక మిలియన్ యూరోలు కోసం ఆశ పడి అందుకోసం ఓటు వేసిన 0.8% ప్రజల పేర్లు బహిర్గతం చేయాలని వారి కోరిక.

ఈ 99.2 శాతం ప్రజల అభిప్రాయం ప్రకారం ఉచిత సొమ్ముని ఆశపడిన ఆ 0.08 శాతం ప్రజలు దేశానికి మచ్చ తెచ్చారు, వారి పేర్లు బహిర్గతం చేస్తే మిగతా పౌరులు అటువంటి చీడపురుగులకు దూరంగా ఉంటాము అన్నది వారి అభిప్రాయం.

ప్రభుత్వ ప్రతినిధులతో చాలాసేపు జరిగిన సంప్రదింపులతో ఒక ఒప్పందం కుదిరింది. ప్రభుత్వం వారి పేర్లు బయట పెట్టదు. కానీ వారిని తగురీతిలో శిక్షిస్తుంది అని ప్రభుత్వం చెప్పడంతో వారు శాంతించారు. ఉచితాలు వద్దు అని 99.2 శాతం ప్రజలు ఏకాభిప్రాయం వ్యక్తపరిచారు అంటే, ఎంత తేడా మిగతా దేశ ప్రజలకు స్విట్జర్లాండ్ ప్రజలకు!?

మనదేశంలో ఐతే ఉచితాలకు చచ్చిన వాడుకూడా లేచి వస్తాడు.

**- శరత్‌కుమార్**

6

జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024

## మన నాణెంపై తెలుగు భాష

స్వాతంత్ర్యానికి పూర్వం 1936 బ్రిటీష్ పాలన రోజులవి. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతున్న సమయం. గాంధీజీ, నెహ్రూ, 'ఉక్కు మనిషి' సర్దార్ పటేల్, ఆంధ్ర ప్రముఖుడు మహామేధావి, భోగరాజు పట్టాబి సీతారామ య్య తదితరులు పాల్గొన్నారు. అప్పుడు పట్టాభి సీతారామయ్య "ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్య"ను సభ దృష్టికి తెచ్చారు. "పట్టాభీ నువ్వు 'ఆంధ్ర రాష్ట్రం.. ఆంధ్ర రాష్ట్రం' అంటూ ఉంటావు. అసలు మీ ఆంధ్ర రాష్ట్రం ఎక్కడ ఉంద య్యా? మీరంతా మద్రాసీలు కదా? అని అన్నారు గాంధీ




గారు ఎగతాళిగా! వెంటనే పట్టాభి సీతారామయ్య తన జేబులో నుంచి "అణా కాసు"ను తీసి గాంధీ జీ దీనిపై 'ఒక అణా' అని అధికార భాష అయిన ఆంగ్లం, హిందీలోనే కాకుండా దేశంలో అత్యధికులు మాట్లాడే బెంగాలీ, తెలుగులోనూ రాసి ఉంది. అది కూడా బ్రిటిష్ వారు ప్రింట్ చేసిన నాణెం (అప్పటికీ భారతదేశానికి ఇంకా స్వతంత్రం రాలేదు). నాణెంపై తెలుగుభాషలో ఒక అణా అని ఉంది కానీ, మీ గుజరాతీ భాష ఎక్కడా లేదే? అంటూ చురక వేశారు. దాంతో గాంధీ గారితో పాటు కొంతమంది తెలుగు మాతృభాష కాని వారు కూడా ఆశ్చర్యపోయారు. అప్పట్లోనే తెలుగు భాషకు బ్రిటిష్ వారు పట్టం కట్టారు అన్న దానికి ఇది ఒక నిదర్శనం.





## సీపీఆర్‌తో ఆగిన గుండెకు ప్రాణం

- చిన్నపిల్లల వైద్యనిపుణుడు కె.వినోద్‌కుమార్
- శ్రీకాకుళంలో ముందస్తు జాగ్రత్తలపై శిక్షణ
- జేసీఐ ఆధ్వర్యంలో కార్యక్రమం

శ్రీకాకుళం:
ఆకస్మిక గుండెపోట్లతో వేలాది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని, వీటిని కొంతవరకు నియంత్రించుటకు సీపీఆర్ శిక్షణ ఇచ్చేందుకు జూనియర్ చాంబర్ ఇంటర్నేష నల్ నడుం బిగించిందని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు కూర్మాన వినోద్‌కుమార్ తెలిపారు.

శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గుండెపోటు -ముందస్తు జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కల్పించి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ సరైన సమయంలో సీపీఅర్ ప్రక్రియతో ఆగిన గుండెకు పునర్జీవనం సాధ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు బగాది ప్రవీణ్‌కుమార్, సెక్రటరీ సింగూరు ప్రవీణ్, ట్రెజరర్ ఐతమ్ వెంకటేష్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇంది రా ప్రసాద్, ఎస్.జోగినాయుడు, గేదెల లక్ష్మి, ఎం.మల్లిబాబు, ఎండ మోహన్, బి.దేవీప్రసాద్, క్రీడాకారులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## దాడులపై మహిళా కమిషన్ సీరియస్

- చికిత్స పొందుతున్న తల్లి, కుమార్తెకు పరామర్శ
- నిందితుడిని అరెస్టు చేయాలని ఎస్పీకి ఆదేశం
- వరుస ఘటనలపై ఈసీ ఆంక్షలు సరికాదని వ్యాఖ్య

నెల్లూరు, మహానాడు:
వింజమూరులో ఆకతాయి దాడిలో గాయపడి నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి, కుమార్తెను శని వారం మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంక టలక్ష్మి పరామర్శించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడినట్లు వివరించారు. వింజమూరులో కొంతకాలంగా యువతిని ప్రేమిస్తున్నా నంటూ నాగరాజు కొంతకాలంగా వేధిస్తున్నాడని, ఈ నేపథ్యంలో శుక్రవారం యువతితో పాటు ఆమె తల్లిపై దాడి చేసినట్లు తెలిపారు. వారికి ప్రాణభయం ఉందని భద్రత కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు.

పరారీలో ఉన్న నిందితుడిని త్వరగా పట్టుకోవాలని, శిక్ష పడేలా చర్యలు చేప ట్టాలని ఎస్పీకి సూచించినట్లు



తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాతే మహిళపై దాడులు పెరిగాయని, వరుస సంఘటనపై మహిళా కమిషన్ చర్యలు చేపట్టకుండా ఈసీ ఆంక్షలు విధించడం సరి కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. బాధితులకు మహిళా కమిషన్, ప్రభుత్వం అండగా ఉండి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని, అనంతరం ప్రభుత్వ షెల్టర్ హోమ్‌కు తరలించాలని అధికారులకు సూచించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై రేవంత్‌రెడ్డి ఆరా

- ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులను వివరించిన ఉత్తమ్
- రిపేర్లు, పునరుద్ధరణతో ముప్పు తొసిపుచ్చలేమని స్పష్టం
- కేబినెట్ భేటీలో చర్చించాలని సీఎం నిర్ణయం

హైదరాబాద్, మహానాడు:
కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికలో ఏమేం సిఫారసులు ఉన్నాయి. ప్రభుత్వం తదుపరి చేపట్టాల్సిన చర్య లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. శనివారం సాయంత్రం సచివాలయంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆయన చర్చలు జరిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీని వాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ కుం గిపోవటం, సుందిళ్ల బ్యారేజీకి బుంగలు పడటంతో తాత్కాలికంగా చేపట్టాల్సిన మరమ్మతులు, పున రుద్ధరణ చర్యలపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చింది.



### మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయం

ఈ నివేదికలోని ముఖ్యమైన అంశాలు, సిఫారసు లను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంతో పాటు మంత్రులకు వివరించారు. 2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్లు తేలిందని, మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండదని తోసిపుచ్చలేమని అందులో స్పష్టం చేసిందని వివరించారు. మరో నెలరోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఈలోగా తీసుకోవా ల్సిన చర్యలపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సీఎం తెలిపారు. మరమ్మతులు చేయాలా? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? మరింత నష్టం జరగకుండా ఏమేం చర్యలు చేపట్టాలనేది ఇరిగేషన్ విభాగం అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. శనివారం నాటి కేబినెట్ భేటీ జరగక పోవటంతో ఈ కీలకమైన అంశాలపై చర్చించ లేకపోయామని వివరించారు. త్వరలోనే మేడిగడ్డ, సుందిళ్ల, అక్కడి పంప్‌హౌస్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎం రమేష్

- రావణ రాజ్యం పోవాలని మొక్కుకున్నట్లు వెల్లడి
- పోలీసులు వైసీపీ కొమ్ముకాస్తున్నారని వ్యాఖ్యలు

తిరుపతి, మహానాడు:
తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ దర్శించుకున్నారు. అనంతరం రంగనా యక మండపంలో వేద పండితుల ఆశీర్వాదం అందు కున్నారు. టీటీడీ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల సీఎం రమేష్ మాట్లాడు తూ రాష్ట్రంలో రావణ రాజ్యం పోయి రామరాజ్యం రావాలని



స్వామివారిని కోరు కున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలని ఓట్లు వినియోగించుకున్న ప్రతిఒక్కరి క్షేమం కోసం స్వామివారి దర్శనం చేసుకున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు రాజ్యం పోయింది...ప్రజల రాజ్యం వచ్చిందని వ్యాఖ్యానించారు. పోలీసులు తమ డ్యూటీ చేస్తున్నారని, కొంతమంది అధికారులు మాత్రం ఇంకా వైసీపీకి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు.

## నాపై విచారణను స్వాగతిస్తున్నా..

- ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు
- అభివృద్ధిని ఓర్వలేని వ్యక్తులే ఫిర్యాదు చేశారు
- కాకతీయ వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్

వరంగల్, మహానాడు:
కాకతీయ విశ్వవిద్యాలయం వీసీగా మూడేళ్ల కాలంలో ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించ లేదని ప్రొఫెసర్ తాటికొండ రమేష్ తెలిపారు. తనపై విజిలెన్స్ విచారణను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మూడేళ్లు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని యూనివర్సిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశాను. ఆ ఫలితమే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్. జాతీయ కాంగ్రెస్ నిర్వహించాం.



మూడేళ్లలో యూనివర్సిటీ సిబ్బందికి, రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని బకాయిలు అందించాం. 507 మంది దినసరి, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు 3 నుంచి 4 రెట్లు పెంచాం. ఒకవైపు అధ్యాపకుల కొరత ఉన్నప్పటికీ 300 మందికి పైగా పీహెచ్ డీ అడ్మిషన్లు అన్ని రకాల రూల్స్ అండ్ రెగ్యులేషన్ అనుసరిస్తూ ప్రవేశాలు కల్పించాం. దొడ్డి దారిలో ప్రమోషన్ల పొందాలని చూసే వ్యక్తులు, అభివృద్ధిని ఓర్వలేక దిగజార్చే ప్రయత్నించే వారు, అక్రమ అడ్మిషన్లు కావాలని గగ్గోలు పెట్టే వారు ఫిర్యాదు చేశారని వ్యాఖ్యానించారు.



11

## మేడిగడ్డ రక్షణ పనులు ప్రారంభం

హైదరాబాద్:
మేడిగడ్డ ప్రాజెక్టు రక్షణ పనులు ప్రారంభమయ్యాయి. వర్షాకాలం లో బరాజ్ వద్ద చేపట్టాల్సిన రక్షణ చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపు ణుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ పనుల ను ప్రారం భించింది. వరద ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలని, గేట్లను తెరిచి ఉంచాలని, ప్రవాహానికి ఆటంకం కలిగించే ఇసుక మేటలు, రాళ్లను తొలగించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించింది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వెంటనే పనులను చేపట్టాలని ఎల్ అండ్ టీ సంస్థకు ఇరిగేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో మేడిగడ్డ బ్లాక్-7లోని 8 గేట్లను ఎత్తివేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. 8 గేట్లలో ఒక గేటును ఇప్పటికే ఎత్తిపెట్టారు. 2 గేట్లు మినహా మిగిలిన గేట్లను సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశం ఉందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు తెలిపారు. పగుళ్లు ఏర్పడిన 20వ పిల్లర్, దాని పక్కన ఉన్న పిల్లర్ గేట్లను ఎత్త డంలోనే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వారు వెల్లడించారు.

## తెలుగు రాష్ట్రాలకు అతి భారీ వర్ష సూచనలు

అమరావతి:
నైరుతీ బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.మే 24 నాటికి ఇది



వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 23వ తేదీ వరకు ఏపీ, తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని, కోస్తాంధ్ర, తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## ఈఏపీ సెట్ మొదటిసారి నిర్వహించాం

- త్వరలో అడ్మిషన్ షెడ్యూల్ విడుదల
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

హైదరాబాద్, మహానాడు:
తెలంగాణ ఈఏపీ సెట్ మొదటిసారి నిర్వహించినట్లు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఈఏపీ సెట్ ఫలితాల విడుదల



అనంత రం ఆయన మాట్లాడారు. గత ఏడాది వరకు ఎంసెట్ పేరు మీద పరీక్షలు జరిగేవన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 1,00,432 మంది దరఖాస్తు చేసుకోగా 91,633 మంది, ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 2,54,750 మంది దరఖాస్తు చేసుకోగా 2,40,618 మంది హాజరైనట్లు తెలిపారు. ఈఏపీ సెట్ రాసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో లేనంతమంది ఈసారి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఒక్కో షిఫ్ట్‌లో 50 వేల మంది పరీక్ష రాశారని, గతంలో ఒక్కో షిఫ్ట్‌లో 25 వేల మంది మాత్రమే రాసేవారని తెలిపారు. ఫలితా లు చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు. అడ్మిషన్ షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని వివరించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 19, మే 2024



# కూటమి ప్రభుత్వంతో ఎస్సీ, ఎస్టీలకు మంచిరోజులు

- దాడులకు గురైన బాధితులకు న్యాయం చేస్తాం
- జైలు తప్పించుకునేందుకే జగన్ విదేశీ యాత్ర
- టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ



**గుంటూరు:**
జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు మంచి రోజులు రానున్నాయని టీడీపీ గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ ఆకాంక్షించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలే ప్రభుత్వాన్ని కూల్చబోతున్నాయని అన్నారు.

నష్టపోయిన రాష్ట్రం బాగుపడి యథాస్థితికి చేరుకోవాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. విదేశాలకు పారిపోయిన జగన్‌రెడ్డి తీరు చూస్తుంటే మరలా స్వదేశానికి తిరిగి వచ్చేలా కనిపించడం లేదని, జైలు జీవితం తప్పించుకోవాలని చూస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు, అనంతరం జే-గ్యాంగ్ చేసిన దాడుల్లో దళిత, గిరిజనులే బలయ్యారు. దాడులకు పాల్పడ్డ వారిని న్యాయస్థానాల ముందు నిలబెడుతామని, రాబోయే ప్రభుత్వంలో న్యాయం చేస్తామని తెలిపారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీని ఎందుకు అరెస్టు చేయలేదు?

- డీజీపీని కలిసి నిలదీసిన బీజేపీ అభ్యర్థి రఘునందన్
- సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, మహానాడు:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డిని పోలీసులు టెందుకు అరెస్టు చేయడం లేదని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు శనివారం డీజీపీని కలిసి నిలదీశారు. తక్షణమే అరెస్టు చేయాలని ఫిర్యాదు చేశా రు. డబ్బుల రవాణా కోసం ఎస్సై సారా సాయికిరణ్‌ను వెంకటరామిరెడ్డి నియమించినట్లు మార్చి 29న రాధాకిషన్‌రావు విచారణలో చెప్పాడు. రాధాకిషన్‌రా వు ఆదేశాల మేరకు వెంకటరామిరెడ్డికి డబ్బులు తరలించానని ఎస్సై సాయికిర ణ్ చెప్పాడు. ఆ డబ్బులు ఎన్నికలకు ఉపయోగ పడ్డాయని వాంగ్మూలంలో రాధాకిషన్‌రావు వెల్లడిరచారు. యశోద ఆసుపత్రి, ప్రతిమ శ్రీనివాస్, రాజ్ పుష్ప కంపెనీల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేశామని స్పష్టంగా చెప్పారు. అయినా ఇప్పటివరకు వెంకటరామిరెడ్డిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నిం చారు. ఆధారాలతో డీజీపీకి ఫిర్యాదు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి వియ్యంకుడు కాబట్టే అరెస్టు చేయలేదా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్‌కు చెంచాగిరి చేసిన వెంకట రామి రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, ఎన్నికల కోడ్ ముగిశాక అరెస్టు చేయకపోతే ఆందోళన, లేదంటే న్యాయవాదిగా పోరాటం చేస్తానని తెలిపారు.

# ఇది ఎన్ఆర్ఐలపై జరిగిన దాడి

- దీని తేలిగ్గా తీసుకోం..డాక్టర్ అక్రమ అరెస్ట్ దుర్మార్గం
- సీఐ, ఆయన బృందంపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి దేవినేని ఉమ, ఎన్ఆర్ఐలు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు

**అమరావతి, మహానాడు:**
అమెరికాలో 40 ఏళ్లుగా అత్యున్నతమైన డాక్టర్‌గా స్థిరపడి రాష్ట్రంలో తన సంపాదనలో వివిధ సామాజిక కార్యక్రమాలు, విరాళాలతో ఎంతోమందికి విద్య, వైద్య సహాయం అందించిన ఒక ఎన్ఆర్ఐపై అక్రమ కేసు హేయమని మాజీ మంత్రి దేవినేని ఉమ ధ్వజమెత్తారు. ఎన్ఆర్ఐ డాక్టర్ ఉయ్యూరు లోకేష్‌పై అక్రమ కేసు పెట్టిన సీఐ, ఆయన బృందంపై చర్యలు తీసుకోవాలని శనివారం డాక్టర్ ఉయ్యూరు లోకేష్‌తో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు తనపై దురుసుగా ప్రవర్తించారని డాక్టర్ లోకేష్ పేర్కొన్నారు. జగన్‌కి ఊడిగం చేసే బ్యాచ్‌ను సస్పెన్షన్ కాదు బర్తరఫ్ చేయాలని అన్ని ఆధారాలను అందజేశారు. అనంతరం దేవినేని ఉమ డాక్టరుతో పాటు పలువురు ఎన్ఆర్ఐలతో చర్చించారు. ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ వంద ల కోట్ల ఆస్తి, పేరు ప్రఖ్యాతులు ఉన్న డాక్టరుకు ఇటువంటి పరిస్థితి ఎదురవడం దురదృష్టకరమన్నారు. జగన్ ప్రభుత్వం మా అందరిపై దాడిగా భావిస్తున్నామని, అమెరికాలో వాషింగ్టన్‌లో దౌత్య కార్యాలయం, అలానే ఇండియన్ ఎంబసీలో సాక్ష్యాలతో సహా ఇవ్వటం జరుగుతుందని వివరించారు. మెడికల్ సర్టిఫికెట్, అన్ని ఆధారాలు సమర్పించటం జరుగుతుందన్నారు. అలానే ఇండియాలో అమెరికన్ ఎంబసీ హైదరాబాద్, చెన్నై, ఢల్లీ, కలకత్తాలో ఉన్న తెలుగు వారి చేత ఇప్పించటం జరుగుతుందని వివిధ ప్రాంతాలలో ఉన్న ఎన్ఆర్ఐలు తెలిపారు. జగన్ కోసం సజ్జల డైరెక్షన్‌లో ఎన్ఆర్ఐలపై దాడి చేసిన సీఐ ప్రసాద్, అతని బృందం సస్పెండ్ చేయించి మరోసారి అమెరికా సిటిజన్ మీద చేయి వేయాలంటేనే భయపడే విధంగా భవిష్యత్తులో చర్యలు ఉండేలా చూస్తామని తెలిపారు.



ప్రవాసాంధ్రుడు డాక్టర్ ఉయ్యూరు లోకేష్‌ను జగన్ రెడ్డి ప్రభుత్వ అక్రమంగా అరెస్ట్ చేసి, విడుదల అనంతరం పరామర్శిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ నాయకులు మన్నవ సుబ్బారావు, దారపనేని నరేంద్రబాబు, చిలక బసవయ్య, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ తదితరులు




# సన్ ఆఫ్ ది సాయిల్ పుస్తకావిష్కరణ

**హైదరాబాద్:**
తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ పత్రికా వ్యాసాల సంకలనం సన్ ఆఫ్ ది సాయిల్ (భూమి పుత్రుడు) పుస్తకాన్ని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి టి.హరీష్‌రావు, గాదరి బాలమల్లు, పుస్తక రచయిత గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనస్‌ను బోగస్‌గా మార్చకండి

- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- జూన్ మొదటివారంలో రైతుబంధు విడుదల చేయాలి
- ఆరు నెలల పాలనలో చెప్పుకోవడానికి చేసిందేమీ లేదు
- తిట్లు మాని కేబినెట్‌లో మంచి నిర్ణయాలు తీసుకోండి
- బీఆర్ఎస్ నేత బి.వినోద్‌కుమార్



**హైదరాబాద్, మహానాడు:**
ఆరునెలలో పాలనలో చెప్పుకోవడానికి రేవంత్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మాజీ శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం ఆరో మాసంలోకి ప్రవేశించింది. చెప్పుకోవడానికి ఏమీ లేదు. నేటి కేబినెట్ సమావేశంలో మంచి నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుంటున్నాం.

రైతుబంధు దేశంలోనే మొదటి సారి అమలుచేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది. రేవంత్ యాసంగి రైతు బంధు పంటలు కోసే సమయానికి ఇచ్చారు. ఈసారి అలాంటి తప్పు చేయ కుండా రైతు భరోసాను రోహిణి కార్తెలో విడుదల చేసేలా కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలి. జూన్ మొదటివారంలోనే రైతులకు ఎకరాకు రూ.7500 విడుదల చేయాలి. ఆ దిశగా కేబినెట్‌లో నిర్ణయించాలి. వర్షా కాలంలోనే ఎక్కువగా సన్నరకాల ధాన్యం పండి స్తారు. రబీలో నూకల శాతం ఎక్కువగా ఉంటుందని రైతులు సన్న రకాలు సాగు చేయరు.

క్వింటాకు రూ.500 బోనస్ సన్న వడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమే. అన్ని రకాల వడ్లకు ఇవ్వాలి. తిట్ల మీద కాకుండా రైతులకు మేలు చేయడంపై కేబినెట్ మీటింగ్‌లో చర్చించాలి. బోనస్‌ను బోగస్‌గా మార్చకండి. రేవంత్‌కు ఇదే కీలకమైన కేబినెట్ సమావేశం. మంచి నిర్ణయాలు తీసుకోవాలి. ఎన్నికలకు ముందు సన్నవడ్లకే బోనస్ అని చెప్పి ఉంటే కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా వచ్చి ఉండేవి కావు. తడిసిన ధాన్యం రైతుల దగ్గర ఎంత ఉన్నా ఈ ప్రభుత్వం కొనుగోలు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

# జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అనుమతి
- ఏర్పాట్లు చేసుకుంటున్న నిర్వాహకులు

**హైదరాబాద్:**
ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ జరగనుంది. దీనికి సంబంధించిన పంపిణీ దారు బత్తిన కుటుంబం కీలక ప్రకట న చేసింది. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజు చేప ప్రసాదం ఇచ్చేందుకు ఈ ఏడాది కూడా జూన్ 8 నుంచి ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రసాదం తింటే ఆస్తమా తగ్గుతుందని వేల మంది ప్రజలు నమ్ముతున్నా రు. అందుకే ఈ ప్రసాదం ఎప్పుడెప్పుడు ఇస్తారా అని ఎదురు చూసే వాళ్ల సంఖ్య వేలల్లో ఉంటుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని కుటుంబం దీనిని పంపి ణీ చేయనుంది. ఇప్పటికే ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నట్టు సమాచారం. ప్రసాదం తయారీ ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఏటా మృగశిర కార్తె ప్రవేశించిన రోజున ఈ ప్రసాదం బతికి ఉన్న చేపలో పెట్టి పంపిణీ చేస్తుంటారు. ఈ ఏడాది జూన్ 8న మృగశిర కార్తె ప్రవేశిస్తోంది. ఆరోజు చేప ప్రసాదం పంపిణీ చేయబోతున్నట్టు బత్తిన అనురీత్‌గౌడ్, గౌరీ శంకర్‌గౌడ్‌లు వెల్లడిరచారు. పంపిణీలో భాగంగా ముందు రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. సత్యనారాయణ స్వామి వ్రతం, భావి పూజ చేసిన తర్వాత ప్రసాదం తయారీ ప్రక్రియ పూర్తి చేస్తారు. తర్వాత రోజు జూన్ 8 నుంచి పంపిణీ ప్రారంభిస్తారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.





# హైదరాబాద్ మెట్రో రైలు వేళల్లో మార్పులు

**హైదరాబాద్:**
నగరంలో మెట్రో రైళ్లకు సంబంధించి ఇప్పటివరకు రాత్రి 11 గంటలకు చివరి రైలు ఉండగా ఇక నుంచి 11.45 గంటలకు చివరి రైలు అందుబాటులో ఉండనుంది. అలాగే ప్రతి సోమవారం ఉదయం 5.30 గంట లకే మెట్రో రాకపోకలు మొదలు కానున్నాయి. మిగతా రోజుల్లో సాధారణంగానే ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమవుతాయి. ఇటీవల రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో వేళల్లో మార్పులు చేసినట్టు సమాచారం. పొడిగించిన వేళలు శుక్రవారం రాత్రి నుంచి అమల్లోకి వస్తాయని మెట్రో అధికారులు వెల్లడించారు.

# బస్సులు, సిబ్బందిపై దాడి చేస్తే చర్యలు

- జరిగిన ఘటనలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం
- తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్
- తిరుమల శ్రీవారి దర్శించుకుని పూజలు

**తిరుమల, మహానాడు:**
ఆర్టీసీ బస్సులు, సిబ్బందిపై దాడులు చేస్తే చర్యలు తప్పవని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. శనివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం బయట మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని, ఆర్టీసీ కార్మికులు కూడా బాగుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిసెంబరు 9 నుంచి ఉచిత బస్సు ప్రయాణంలో రోజుకు 50 వేల నుంచి లక్ష మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కొన్ని చోట్ల ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేశారని వాటి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దాడులు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



### తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో రాజ్యసభ సభ్యులు సంతోష్‌రావు, సుధా నారాయణ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పా ట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేసి తీర్థప్రసాదాలు ఇచ్చారు.

# ఆస్తి కోసం తల్లి, ఇద్దరు కూతుళ్ల హతం

- ఖమ్మం జిల్లాలో గోపాలపేటలో దారుణం

**ఖమ్మం, మహానాడు:**
ఆస్తి కోసం తల్లి, ఇద్దరు కూతుళ్ల హత్య చేసిన కసాయి ఉదంతం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు తన పేరుపై ఆస్తి రాసివ్వడం లేదని కోపం పెంచుకున్నాడు. తల్లి పిచ్చమ్మ(60)ను గొంతు నులిమి చంపాడు. అనంతరం ఇద్దరు కుమార్తెలు నీరజ(10), ఝాన్సీ(6)లను చంపి పరారయ్యాడు. పొలం తన పేరుపై రాయాలంటూ తల్లిని వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా నిందితుడు వేధిస్తున్నట్లు తెలుస్తుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



కాగా, వెంకటేశ్వర్లు ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, రెండేళ్ల క్రితం భార్యను కూడా హత్య చేశాడని స్థానికులు చెబుతున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ఆదివారం 19, మే 2024

## సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా
# నా ఉచ్ఛ్వాసం కవనం కర్టెన్ రైజర్

దిగ్గజ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా రూపొందిన కార్యక్రమం నా ఉచ్ఛ్వాసం కవనం. శృతిలయ ఫౌండేషన్ నిర్వహణలో ఈ కార్యక్రమానికి రామ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. సిరివెన్నెల పాటల అంత రంగాన్ని ఆవిష్కరించే ఈ కార్యక్రమం ఈటీవీలో ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రసారం కానుంది. తాజాగా నా ఉచ్ఛ్వాసం కవనం ప్రోగ్రాం కర్టెన్ రైజర్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ ఈ కార్యక్రమానికి హాజరై టీజర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామ్ శాస్త్రి మాట్లాడుతూ - మనమంతా ఒక కారణంతో ఈ భూమ్మీదకు వస్తాం. అలా ఒక బృహత్తరమైన బాధ్యతతో పుట్టారు అన్నయ్య సీతారామశాస్త్రి. తన కర్తవ్యాన్ని ముగించి వెళ్లిపోయారు. ఉన్నంతకాలం శ్రమ చేస్తూనే ఉన్నారు. ఎన్నో విలువైన పాటలను మనకు అందించారు. ఆ పాటలతో సమాజాన్ని మేల్కొలిపారు. అన్నయ్య సినిమా పాటల రచయిత కాకుండా ఇంకా గొప్ప స్థాయిలో ఉండేవారని కొందరు అంటారు కానీ అన్నయ్య ఆ మాట ఒప్పుకోడు. సినిమా మాధ్యమం వల్లే ఇంత విస్తృతంగా తన పాట ప్రజల్లోకి వెళ్లిందని అనేవారు అన్నారు. దర్శకుడు కృష్ణవంశీ మాట్లాడుతూ - నాకు సీతారామశాస్త్రి గారు చాలా కాలంగా తెలుసు. ఆయన పరిచయం ఒక అదృష్టంగా భావిస్తా. నేను ఏ సినిమా మొదలుపెట్టినా ముందు సీతారామశాస్త్రి గారి దగ్గరకు వెళ్లి పాటల గురించి డిస్కస్ చేస్తుండేవాడిని. నా కొత్త సినిమా మొదలుపెట్టాలని ఆరేడు నెలల నుంచి ప్రయత్నిస్తున్నా. కానీ పాటలు ఏం చేయాలో అర్థం కావడం లేదు. శాస్త్రి గారు



లేకపోవడం వల్ల అనాథగా మారిన భావన కలుగుతోంది. శాస్త్రి గారి గురించి ఇంత మంచి ఈ కార్యక్రమం శ్రీరామ్ కు , పార్థసారధి నా కృతజ్ఞతలు చెబుతున్నా అన్నారు.

## మక్కల్ సెల్వన్
# 'ఏసీఈ' ఫస్ట్ లుక్



విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ లీడ్ రోల్స్ లో ఆరుముగ కుమార్ దర్శకత్వంలో ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. యోగి బాబు, పి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కరణ్ బహదూర్ రావత్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనింగ్ ఎ.కె. ముత్తు, ఆర్. గోవిందరాజ్ ఎడిటింగ్. 'ఏసీఈ' అనే డిఫరెంట్ టైటిల్ తో రూపొందుతున్న ఈ కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 7సిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ గా నిర్మిస్తుంది. సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లో రివీల్ చేసిన ఫస్ట్ లుక్ లో విజయ్ సేతుపతి యూత్‌ఫుల్ లుక్, స్మోకింగ్ పైప్, డైస్ వేస్తూ కనిపించి అందరినీ ఆకర్షించారు. ఇది సినిమా గురించి అభిమానులలో క్యూరియాసిటీని పెంచింది. స్టార్ కాస్ట్, ఆకట్టుకునే నేపథ్య సంగీతం, విజయ్ సేతుపతి ఆన్ స్క్రీన్ ప్రెజెన్స్‌ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా టీజర్ అభిమానులను ఆకట్టుకుంది. జూదం, తుపాకులు, పేలుళ్లు, రాబరీస్, బైక్ ఛేజింగ్ వంటి అంశాలు అలరించాయి. టీజర్‌లో యోగి బాబు కామిక్ రియాక్షన్ హ్యూమర్ రేకెత్తిస్తుంది. ఇది సినిమా హిలేరియస్ క్రైమ్-కామెడీ థ్రిల్లర్‌గా ఉంటుందని తెలియజేస్తుంది. ఈ విజువల్ గ్లింప్స్, టైటిల్ ప్రివ్యూ, జస్టిన్ ప్రభాకరన్ కంపోజ్ చేసిన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పాటు యానిమేటెడ్ ఫార్మాట్‌లో పాత్రల యొక్క ముఖ్యమైన అంశాలు రివిల్ చేయడం వల్ల ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది.



# 'సిద్ధార్థ్ 40' అనౌన్స్ మెంట్

సక్సెస్ ఫుల్ పాన్-ఇండియన్ యాక్టర్ సిద్ధార్థ్ చిత్ర పరిశ్రమలో 21 సంవత్సరాల అద్భుతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ప్రతి పరిశ్రమలో శాశ్వత ప్రభావాన్ని చూపారు. అతను ఎంచుకునే కథలు, పాత్రల, అసాధారణమైన పెర్ఫార్మెన్స్ తో అద్భుతంగా అలరిస్తున్నాయి. బాలీవుడ్‌లో 'రంగ్ దే బసంతి'తో చెరగని ముద్ర వేశారు. తెలుగులో 'బొమ్మరిల్లు'తో ప్రేక్షకుల మన్ననలు పొందారు.

తమిళ పరిశ్రమలో పలు జోనర్‌లలో మెరిసి.. సినిమా, నటనపై తనకున్న గొప్ప అభిరుచిని చూపించారు సిద్ధార్థ్. ఆయన లేటెస్ట్ ప్రాజెక్ట్ 'చిత' ప్రేక్షకుల హృదయాల్లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పుడు, సిద్ధార్థ్ 'సిద్ధార్థ్ 40'( వర్కింగ్ టైటిల్) పేరుతో మరో ఎక్సయిటింగ్ మూవీ కోసం కోసం మంచి యూనిట్ తో చేతులు కలిపారు. ఈ అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ను '8 తొట్టక్కల్'తో పేరుపొందిన శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు- తమిళ్ లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ "యూనివర్సల్ ఆడియన్స్ అభిరుచులను ఆస్వాదించే మంచి కంటెంట్‌ను అందించాలనే దృక్పథాన్ని కలిగి ఉన్న మన పరిశ్రమలోని యంగ్ టీంతో కలిసి పని చేస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. సినిమా ఔత్సాహికులు, ఫ్యామిలీస్ 'చిత్త'పై తమ ప్రేమను కురిపించారు ఇది వారి భావాలను హత్తుకుని, మంచి కథలను ఎంచుకోవడానికి నాలో మరింత బాధ్యతను నింపింది. నేను చాలా స్క్రిప్ట్‌లు విన్నాను, శ్రీ గణేష్ చెప్పిన కథ నాకు ఎంతగానో నచ్చింది. ప్రేక్షకులపై ప్రభావం చూపే సినిమాలను తీయడమే నిర్మాతల ఆనందం. అలాంటి మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా వుంది. ఆయన మంచి సినిమాతో పరిశ్రమను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలలు కనే నిర్మాత. మా అంకితభావం, పాషన్‌తో ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించే అద్భుతమైన సినిమాని అందిస్తాయనే నమ్మకం నాకుంది" అన్నారు.

## లేడీ మన్నార్‌తో
# బాలయ్య



నందమూరి బాలకృష్ణ దాదాపు రెండు నెలల రాజకీయాల తర్వాత ఎట్టకేలకు సినిమా షూటింగ్ లో జాయిన్ అయ్యాడు. బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న ఇంకా టైటిల్ ఖరారు కాని సినిమాలో కీలక పాత్రలో శ్రియా రెడ్డి నటిస్తుంది అంటూ చాలా రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం బాలయ్య తో పాటు శ్రియా రెడ్డి కూడా షూటింగ్ లో పాల్గొంటుందని చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో శ్రియా రెడ్డిని అత్యంత పవర్ ఫుల్ పాత్రల్లో చూశాం. ముఖ్యంగా సలార్‌లో రాధా రమా మన్నార్ పాత్రలో ఆమె నటనకు ఎంతటి ప్రశంసలు దక్కాయో అందరూ చూశారు. కనుక ఆ స్థాయి పవర్ ఫుల్ పాత్రనే దర్శకుడు బాబీ కూడా తన సినిమాలో ఇచ్చినట్లుగా తెలుస్తోంది. బాలయ్య సినిమాలో విలన్స్‌గా పవర్ ఫుల్ పాత్రల్లో మగాళ్లు కనిపిస్తారు. అయితే ఈసారి లేడీ విలన్ తో బాలయ్య ఢీ కొట్టే అవకాశాలు కనపిస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరి కాంబో సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు వీరి కాంబో సన్నివేశాలు స్క్రీన్ పై చూస్తామా అంటూ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాలయ్య మరియు బాబీ మూవీ కి సంబంధించిన విడుదల తేదీ విషయంలో అతి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాల్తేరు వీరయ్య సినిమా తర్వాత బాబీ దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా బాలయ్య కూడా వరుసగా మూడు విజయాల తర్వాత ఈ సినిమాను చేస్తున్నాడు. ఎలా చూసినా కూడా ఈ సినిమా పక్కా కమర్షియల్ హిట్ అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



## హనీమూన్ ఎక్స్‌ప్రెస్‌లోని
# మూడో పాటను విడుదల

ఎన్ ఆర్ ఐ ఎంటర్‌టైన్మెంట్స్ (యు ఎస్ ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకం పై చైతన్య రావు, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్ గా నటించిన చిత్రం "హనీమూన్ ఎక్స్‌ప్రెస్". తనికెళ్ల భరణి మరియు సుహాసిని ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి బాల రాజశేఖరుని రచయిత దర్శకుడు. కళ్యాణి మాలిక్ సంగీతం అందించగా కె కె ఆర్ మరియు బాల రాజ్ సంయుక్తంగా ఈ రొమాంటిక్ కామెడీ ని నిర్మించారు.

ఇప్పటికే హనీమూన్ ఎక్స్‌ప్రెస్ చిత్రం నుంచి సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్ స్వరపరిచిన రెండు రొమాంటిక్ మెలోడీ పాటలు విడుదలై ఇంటర్నెట్ లో ట్రెండింగ్ లో నిలిచాయి.

ఇప్పుడు ఈ చిత్రం నుంచి మూడో పాటను యాక్షన్ హీరో అడివి శేష్ చేతుల మీదుగా విడుదల చేశారు చిత్ర యూనిట్. గూఢచారి 2 మరియు డెకాయిట్ చిత్రాలతో బిజీగా ఉన్నా అడివి శేష్, దర్శకుడు బాల గారి చిరకాల పరిచయం వలన అన్నపూర్ణ 7 ఎకరాల ప్రాంగణంలో హనీమూన్ ఎక్స్‌ప్రెస్ లో క్యూట్ గా స్వీట్ గా అనే అందమైన లిరికల్ పాటను వీక్షించి విడుదల చేశారు. అనంతరం అడివి శేష్ మాట్లాడుతూ "క్యూట్ గా స్వీట్ గా పాట చాలా స్వీట్ గా ఉంది, సాహిత్యం చాలా బాగుంది అని కొనియాడారు. చిత్రం మంచి విజయం సాధించాలి" అని కోరుకున్నారు.

## మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్
# "సంతాన ప్రాప్తిరస్తు"

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా సంతాన ప్రాప్తిరస్తు సినిమా ఇవాళ హైదరాబాద్ లో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు.



వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా సంతాన ప్రాప్తిరస్తు సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత, వ్యాపారవేత్త అంబికా కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా...వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు క్లాప్ నిచ్చారు. మధుర శ్రీధర్ రెడ్డి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. ఇద్దరు ప్రొడ్యూసర్స్ స్క్రిప్ట్ ను దర్శకుడు సంజీవ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ - మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చిత్రమిది. ఇవాళ ఫ్యామిలీ ఆడియెన్స్ థియేటర్స్ కు రావడం లేదు. వాళ్లను రప్పించేలా మూవీ పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చేలా ఉంటుంది. ఎంటర్ టైన్ మెంట్ ఉంటూనే ఒక కాంటెంపరరీ ఇష్యూను కథలో చూపిస్తున్నాం. వరంగల్ అమ్మాయి, హైదరాబాద్ అబ్బాయి మధ్య కథ జరుగుతుంది. కొత్తగా పెళ్లైన జంట ఎదుర్కొనే ఓ సమస్యను వినోదాత్మకంగా మూవీలో తెరకెక్కిస్తున్నాం. అన్నారు. నిర్మాతలు మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ - ఈ రోజు మా సినిమా సంతాన ప్రాప్తిరస్తు లాంఛనంగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ముహూర్తపు సన్నివేశానికి కెమెరా స్విచ్చాన్ చేసిన అంబికా కృష్ణ గారికి, క్లాప్ నిచ్చిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజుకి కృతజ్ఞతలు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144